# ANNAMACHARYA MISSION
# అన్నమాచార్య మిషన్

18th May 2000

విక్రమ-వైశాఖ-విశాఖ-పౌర్ణమి


Volume : 1


Issue : 1

## BULLETIN

KAMISETTY SRINIVASULU
MANAGING TRUSTEE







9885086244
(Narayana)

అన్నమాచార్యులు

## LORD VENKATESWARA

ओं नमो वेंकदेशाय शेषाद्रिनिलयाय च ।
सिंहाचलनिवासाय श्रीमन्नारायणाय च ।
त्वत्स्वरूपं यथावद्धि ज्ञातुं शक्नोति कः पुमान् ।
क्वचित्सहस्रमुर्धा त्वं सहस्राक्षः सहस्रपात् ॥
कदाचिद् द्विभुजस्त्वं तु कदाचित् त्वं चतुर्भुजः ।
कदाचिच्चतव स्वामिन्न किञ्चच्चरणादिकम् ।
आकाशमिव ते रूपं कदाचित् ज्ञानगोचरम् ।
कदाचिन्निर्विकल्पेन वेधं यत्नेन कस्यचित् ॥
आहुस्त्वां सगुणं केचिन्निर्गुणं ज्ञानमात्रकम् ।
किञ्चिदित्येव केचितु सदित्येव तु केचन
दिव्यावयवसौन्दर्य नित्यविग्रहयोगिनम् ।
वदन्ति केचिदस्माकमपि तन्मतमुत्तमम् ।
हृद्यं प्रामाणभूयिष्ठं तं नताःस्म जगद्गुरुम् ॥

Varaha-purana (1, 16, 6-10)

"Who indeed can fathom your form as it really is ? Sometimes myriad-headed, myriad-eyed and myriad-footed; sometimes with but two arms, and at times four-armed; sometimes devoid of all limbs and subtly pervasive like sky. At times, you become readily known to our minds, and at other times perceived only in deep contemplation. For some, you are full of forms, shapes, qualities and aspects; and for others, totally devoid of any identifiable form or attribute. Some realize you as pure awareness, and some only as pure existence. However, what we prefer is the view that you have a magnificent and bewitching form, charming our hearts and bringing hope and succour to our lives. It comes well within our inner experience, and its authenticity as beyond doubt".

**S.K. RAMACHANDRA RAO**
"THE HILL - SHRINE OF VENGADAM"

# తాళ్లపాక అన్నమాచార్యులు

జననం : 9-5-1408 (సర్వధారి వైశాఖ పూర్ణిమ)

నిర్యాణం: 23-2-1503 ( దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశి)

రచనలు:

శృంగార సంకీర్తనలు : 1526

అధ్యాత్మ సంకీర్తనలు: 2209

శృంగార మంజరి

వేంకటేశ్వర శతకం

**( అలభ్యములు )**

తెలుగు : ద్విపదరామాయణం, పదకొండు శతకాలు ( పేర్లు తెలియవు)

అనేక భాషలలో ప్రబంధాలు ( పేర్లు తెలియవు)

**సంస్కృతం :** **వేంకటాచలమాహాత్మ్యం**

**సంకీర్తన లక్షణం**

**బిరుదాలు:** **పదకవితాపితామహుడు**


**సంకీర్తనాచార్యుడు**

**పంచమాగమసార్వభౌముడు**

**ద్రవిడాగమసార్వభౌముడు.**

★★★

**ముఖచిత్రం : శ్రీ గోలి శివరాం**



“ అదిగో నందక మవతరించె
హరి నందకమే భువి నవతరించె


నారాయణు నోము ఫలించె
లక్కమాంబ గర్భము ఫలించె
కొండలప్పనికి మ్రొక్కిన మ్రొక్కులు
హరి నందకాంశమున ఫలియించె”

“ రాజీవనయను వరప్రసాదమున, తేజంబు మతియు నెంతే విస్తరిల్ల, లక్కమాంబకు పుణ్యలావణ్య నిధికి, చక్కని గ్రహము లుచ్చమున మూడలర, అనుపమ లగ్నంబునందు, వైశాఖమున విశాఖను జగంబున నుల్లసిల్ల జనియించె నన్నమాచార్యుండు ....”( అన్నమాచార్య చరిత్ర - చిన్నన్న)

# అంకితం

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు

**కీ. శే. శ్రీమతి లక్ష్మీదేవి వేంకటసుబ్బయ్య గార్లు**



నా బహిః ప్రాణం ప్రాణమిత్రుడు

**కీ.శే. చేట్లూరు శేషాద్రి**





# అన్నమాచార్య మిషన్

నేను సుమారు నాలుగు దశాబ్దాలుగ సాగిస్తున్న అన్నమయ్య సారస్వత సేవకు సింహావలోకనంగ భవిష్యత్తు కార్యక్రమాలకు 'వేదిక' గ నా ఇంటి దేవుడు అహోబల లక్ష్మీనృసింహుడు, నా ఇష్టదైవం తిరుమల వేంకటాచలపతి అనుగ్రహించిన ప్రసాదం అన్నమాచార్యమిషన్.

నేను భక్తిపూర్వకంగ వెలిగించుకున్న చిన్న దీపం ''త్రికరణశుద్ధిగ చేసిన పనులకు దేవుడు మెచ్చు లోకమును మెచ్చును'' అనే అన్నముని మాట - బాటగా జీవయాత్ర సాగించడమే.

చేసినది చాల తక్కువ. చేయవలసినది చాలఉంది. శాస్త్రానికి సంస్థ ఉద్దేశ్యాలు కొన్ని చట్రంలో బిగించడం జరిగింది. ఈ పరిధిలో, విన్నంత - కన్నంత, తెలియవచ్చినంత, తేటపరచడమే నేను చేయగలిగినది. ఈ ఉద్యమంలో నాతో మనసు మాట కలిపిన కుటుంబసభ్యులకు, మిత్రులకు ఆ శ్రీనివాసుని అనంత మంగళాశాసనాలు. పారమార్థికమైన కార్యకలాపాలైనా అర్థబలం, అంగబలం లేనిదే అవి ఆకృతిని పొందలేవు. కొండంత సంస్థ అండతో ఇంతవరకు నేను సాగించిన పనులు వేరు, కొండలరాయని అనుగ్రహబలంతో నేను మునుముందు నడిపే కార్యక్రమాలు ఏ రూపమెత్తగలవో. ''అంత మీదు పనులు ఆతడే యెరుగు''.

అన్నమాచార్యమిషన్ ద్వారా నిర్వహించే ప్రతిపని నలుగురు పెద్దల ఆమోదంతోనే జరుగుతుంది. ''మత్కృతికి వలసినది అలంకృతి, చమత్కృతి; అహంకృతి'' కాదంటాడు అన్నమయ్య. అన్నముని జీవితం, తపస్సు. వేంకటేశ్వరుని సేవానిరతి. జీవనభ్రాంతిపడే సిరులను అతడు కోరలేదు. ''పుట్టుభోగులము మేము భువిహరిదాసులము, నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా'' అనడం తెలికే, మరి అట్లా

నడవడం అంతసులభంకాదు. నా దృష్టికందిన శాసనాలలో కాని, రచనల్లోకాని, తుదకుకైఫీయత్తులలో కూడా అన్నమయ్య దానాన్ని పరిగ్రహించిన దాఖలా కనిపించదు. తర్వాతి తాళ్లపాక కవులు ఇవ్వడం పుచ్చుకోవడం చేసినారు. ఆ దానధర్మాలు కూడా దేవాలయాల జీర్ణోద్ధరణకు, ఉత్సవాల ఏర్పాటుకు, ఎన్నో ధార్మిక కార్యక్రమాలకు వినియోగించినట్లు శాసనస్థమైన ఆధారాలున్నవి. తాళ్లపాక వారు చేసిన గొప్ప సారస్వత సేవ ఆ సంకీర్తనలనన్నింటిని రాగి రేకుల మీద వ్రాయించడం. పోయినవి పోగా మిగిలినవానినైన మనం భద్రపరుచుకోవలె.

అన్నీ మనమే చేయాలనుకోవడం పొరపాటు. అన్నీ ఒక్కరే చేయడం కూడా సాధ్యమయ్యేపనికాదు. ఎవరు ఏ పని చేస్తే బాగుంటుందో తెలుసుకొని తెలివిగా కార్య క్రమాలు నిర్వహించడమే. అన్నమాచార్యమిషన్ ఈ దృష్టితో పనిచేసే వారందరికి ఒక వేదికగా నిలవడమే కాదు తన సంపూర్ణ సహకారాలను అందిస్తుంది. నాలుగు కాలలపాటు పదిలంగా పదిమందికి ఉపయోగపడే పనులు చేయాలనే సంకల్పం. అవి ఏవి- ఎట్లా- ఎప్పుడు అనేది ముందు ముందు తెలియగలవు.

అన్నమాచార్య వర్ధంతి మహోత్సవాలను తిరుమలతిరుపతి దేవస్థానం వారు కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారి ద్వారా జరిపించినారు. 'అన్నమాచార్య జయంతి' ని నా ద్వారా జరిపించిన దేవస్థానం యాజమాన్యం ఔదార్యము గొప్పది. దీనికి అనుమతి - ఆదేశం ప్రసాదించినవారు శ్రీ పి. యస్. రాజగోపాలరాజు గారు, అప్పటి కార్యనిర్వహణాధికారి. వీరు, కీ.శే. అన్నారావుగారు ( అప్పటి ఛైర్మన్) అన్నమాచార్య ప్రచారకార్యక్రమాలను నాతో చేయించిన అనురాగమూర్తులు. దేవస్థానంలో సాగుతున్న, నేను సాగిస్తున్న అన్నమాచార్యకార్యక్రమాలను చూసి అన్నమాచార్యప్రాజెక్టును స్థాపించి ఆ ప్రసాదాన్ని, ప్రాసాదాన్ని నాకు అప్పగించిన క్రాంతదర్శి శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు. అన్నమాచార్య ప్రాజెక్టు సాగించిన కృషి అనన్యసామాన్యమయినది. అన్నమయ్య పాటకు ఒక ఆవరణ ఏర్పరచినది; శ్రోతలను సిద్ధం చేసినది. కళాప్రపంచము అన్నమయ్య వైపు ఆశ్చర్యంగ తిలకించినది. మాట-పాట-ఆట ఊపందుకొన్నది. అది ఉప్పెన కాకుండా ఆనకట్టవేసి సారవంతంగ మలచవలసిన భాధ్యత మనఅందరి మీద ఉన్నది.

అన్నమయ్య పదవికి విరమణ తప్పదు, కానీ, అన్నమయ్య పనికి విరమణ లేదు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఏలుబడిలో అధ్యాపకునిగ, అన్నమాచార్య, శ్రీవేంకటేశ్వర రికార్డింగు ప్రాజెక్టుల సంచాలకునిగ పనిచేసి ఈ మధ్యనే పదవీ విరమణ చేసిన

నాకు ఒక అవలంబన అవసరమయింది. ఇది నాకు వేంకటరమణుడు ''కప్పినవైష్ణవం'' అన్నమయ్యపాటలాగా ఈ జీవితపు బాట సాగినంతకాలం .......
'' ఎంతకాలంబు నీకు వేడుక అంతకాలంబు ఆడుదము''

''విడువలేని శ్రీవేంకటవిభుడవు
కడదాకా నను కాతువు గాక ''

అన్నమయ్య జీవితకథ శ్రీ బాపూ గారి బొమ్మలతో ఈ సంపుటిని అలంకరించినది. ఆత్మీయ మిత్రులు చిత్రకళా శిల్పి శ్రీ బాపూగారికి నా కృతజ్ఞతలు. బులెటిన్ ముఖచిత్రాన్ని తీర్చి అన్నమయ్య భావనామయ విశ్వాన్ని మనోజ్ఞంగ చిత్రించిన సహృదయ మిత్రులు శ్రీ గోలి శివరాం గారికి నా ధన్యవాదాలు. పారమార్థికమైన దృష్టితో ఈ బులెటిన్ ముద్రించి సమయానికి అందించిన స్నేహితులు శ్రీ ఉదయ్ ప్రింటర్స్ అధినేత శ్రీ ప్రభాకర్ గారికి, వారి సతీమణికి శ్రీనివాసుని అనంత మంగళాశాసనాలు.

గురు దేవుళ్ళు కీ.శే. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారి 'అన్నమాచార్య కవిత వ్యాసం' యల్లంరాజు శ్రీనివాసరావు గార్ల 'అన్నమాచార్య సుప్రభాతం' ఈ సంపుటి విలువను పెంచినవి. వారికి నేను చేయగలిగినదేమున్నది. భక్తిపూర్వక పాదాభివందనమే. ఆచార్య ఎస్.కె. రామచంద్రరావు గారి గ్రంథం నుండి కొంత భాగం ఉపయోగించినాను, వారికి నా కృతజ్ఞతలు. 592 వ తాళ్లపాక అన్నమాచార్య జయంతి మహోత్సవాలలో దయతో పాల్గొన్న కవులకు, పండితులకు కళాకారులకు, ఆత్మీయులకు సహృదయులకు నా హృదయపూర్వక నమస్కృతులు.


ఈ సేవాభాగ్యాన్ని నాతో పాటు పాలు పంచుకున్న కుటుంబసభ్యులకు, హితులకు, సన్నిహితులకు అలవేలుమంగా శ్రీనివాసుల మంగళాశీస్సులు.

ఈ ' సమాచార సంపుటి ' ద్వారా ప్రతి మాసం మిమ్మల్ని కలుసుకోవాలని ఉంది. ప్రశాంత చిత్తవృత్తితో దీనిని చిత్తగించి నన్ను కృతార్థుని చేయగలరు.

ఇట్లు
మీ ''హితభటుడు''

విక్రమ-వైశాఖ-విశాఖ-పౌర్ణమి
18-05-2000

(కామిశెట్టి శ్రీనివాసులు)



VIII

# అన్నమాచార్య సుప్రభాతం

రచన : యల్లంరాజు శ్రీనివాసరావు

శ్రీమత్ త్వదీయ చరితామృత మన్నయార్య
పీత్వాపినైవ సుహితా మనుజా భవేయుః
త్వం వేంకటాచలపతేరివ భక్తి సారం
శ్రీ తాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

సాహిత్య జాంగల వనే హరి భక్తి బీజ
మాకీర్య కీర్తన రభిషిచ్య నిత్యం
సాయుజ్య ధాన్య నిచయం దిశసి ప్రజాభ్యః
శ్రీతాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

త్వత్సాహితీ కలమ రాశి కణాన్ గృహీత్వా
సర్వే ప్రబంధ కవయశ్చటకా యథైవ
కుర్వన్తి కావ్య గగనే కల కూజితాని
శ్రీతాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

భాషా పయోధి మథనే పరితః ప్రకీర్ణై
రంభః కణైరివ పదై స్సకలాంధ్ర లోకం
ఆ పూరయన్ హరిరివాభి నవో విభాసి
శ్రీతాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

వాగ్గేయ కార మతి వైభవ దీపకేషు
త్వత్కల్పితేషు రస దిగ్ధ పదేషు నిత్యం
కుర్వత్సుబోధమిహానః కుత ఏవ మోహః

శ్రీతాళ్ళపాక గురుదేవ నమో నమస్తే


నానా విధాభి రపితే నృవరార్పితాభిః
సంపల్లతాభి రనిరుద్ధమనో విహంగః
శ్రీ వేంకటేశ పదయోః స్వయమేవ బద్ధః
శ్రీతాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

వైరాగ్య శేవధి ముపార్జితవాం స్త్వమేవ
సర్వైశ్చ భోగవిభవై రసి వర్జితస్త్వమ్
త్వం శ్రీనివాస దయితస్తవ శ్రీనివాసః
శ్రీతాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

ఇతి శ్రీ తాళ్ళపాకాన్న మాచార్య పద పాంసునా
శ్రీనివాసేన రచిత స్సువర్ణ సుమనోంజలిః

★





# మహాలక్ష్మి అర్చన

తిరుమల క్షేత్రంలో మహాలక్ష్మి నిత్యానపాయినిగ శ్రీనివాసుని వక్షస్థలంలో ఉన్నది. వంటయింటిలో పోటుతాయారుగ వెలసినది. తాళ్లపాక అన్నమాచార్యులు సంకీర్తనలలో వీరి ప్రస్తావన కనిపిస్తుంది. తిరుచానూరులో నెలకొన్న పద్మావతీ దేవిని గురించి, ఉపలబ్ధమైన తాళ్లపాకవారి పాటలలో, ప్రస్తావన లేదు. వేంకటరమణుని వక్షశ్శయ్య ఉన్న అలమేలుమంగను, వంటయింటిలో అలమేలుమంగను ఈ పరమ భాగవతోత్తముడు కీర్తించినాడు.

మహాలక్ష్మికి బిల్వదళ పూజ అభీష్టమైనది. ఈ తల్లి బిల్వవనంలోనే వాసం చేస్తుందట. ప్రతి శుక్రవారం ఈ మహాలక్ష్మిని ఇక్కడ పొందు పరచిన ఇరువది నాలుగు నామాలను జపిస్తూ బిల్వదళాలతో అర్చిస్తే సర్వాభీష్టాలు నెరవేరుతాయని ఆప్తవాక్యం. మన ధ్యాన సమాధిలో నిలువవలసినది శ్రీ వేంకటాచలపతి వక్షస్థలంలో కాపురమున్న అలమేలుమంగ. తిరుమల దేవాలయంలో స్వామికి శుక్రవారాభిషేకం తర్వాత "తాయారు తిరుమంజనం" వక్షస్స్థల లక్ష్మికి ప్రత్యేకంగ ఏకాంతంగ నిర్వహింపబడుతుంది. దీనిని భగవద్రామానుజులు శుక్లద్వాదశి, శుక్రవారం, ఉత్తరఫల్గునీ నక్షత్రము కూడియున్న రత్నమంజరికాయోగమున ఈ ద్విభుజవ్యూహలక్ష్మి కి ఏర్పాటు చేసినారు.

శ్రీరస్తు . శుభమస్తు

శ్రీ మహాలక్ష్మి చతుర్వింశతి నామావళిః

శ్రీవేంకటేశ మహిషీ మహాలక్ష్మి ప్రీత్యర్థం శ్రీ వేంకటేశమహిషీ మహాలక్ష్మి చతుర్వింశతి నామభిః శ్రీ వేంకటేశ మహిషీ మహాలక్ష్మ్యర్చనం కరిష్యే

అస్య శ్రీ మహాలక్ష్మి చతుర్వింశతినామ మంత్రస బ్రహ్మ ఋషిః అనుష్టుప్ ఛందః, శ్రీ మహాలక్ష్మి దేవతా, శ్రీ వేంకటేశ మహిషీ మహాలక్ష్మి ప్రీత్యర్థే జపే వినియోగః

ధ్యానమ్ :

ఈశానాం జగతోఉస్య వేంకటపతేర్విష్ణోఃపరాంప్రేయసీం
తద్వక్షస్థల నిత్యావాసరసి కాం తతాంతి సంవర్ధినీం
పద్మాలంకృత పాణిపల్లవయుగాం్మపద్మాసనస్థాం శ్రియం
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరం.

ఓం శ్రియై నమః
ఓం లోకధాత్ర్యై నమః
ఓం బ్రహ్మమాత్రే నమః
ఓం పద్మనేత్రాయై నమః
ఓం పద్మముఖ్యై నమః
ఓం ప్రసన్నముఖపద్మాయై నమః
ఓం పద్మకాన్త్యై నమః
ఓం బిల్వవనస్థాయై నమః
ఓం విష్ణుపత్న్యై నమః
ఓం విచిత్రక్షౌమధారిణ్యై నమః
ఓం పృథుశ్రోణ్యై నమః
ఓం పక్వబిల్వఫలాపీన తుంగస్తన్యై నమః

ఓం సురక్త పద్మపత్రాభకర పాదతలాయై నమః
ఓం శుభాయై నమః
ఓం సరత్నాంగద కేయూర కాంచీనూపుర శోభితాయై నమః
ఓం యక్షకర్దమ సంలిప్త సర్వాంగాయై నమః
ఓం కటకోజ్జ్వలాయై నమః
ఓం మాంగల్యాభరణైశ్చిత్రైర్ముక్తాహారైర్విభూషితాయై నమః
ఓం తాటంకైరవతంసైశ్చ శోభమాన ముఖాంబుజాయై నమః
ఓం పద్మహస్తాయై నమః
ఓం హరివల్లభాయై నమః
ఓం ఋగ్యజుస్సామరూపాయై నమః
ఓం విద్యాయై నమః
ఓం అబ్ధిజాయై నమః

ఏవం చతుర్వింశతి నామభిః బిల్వపత్రైః లక్ష్మ్యర్చనం
కుర్యాత్ సర్వాభీష్ట సిద్ధిర్భవతి
ఇతి చతుర్వింశతి నామావళిః




గురుదేవులు రాళ్లపల్లి
మిత్రుడు శేషాద్రితో

# అన్నమాచార్య కవిత

- రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

తెలుగువాఙ్మయపు చరిత్రలో పదునైదవ క్రీస్తు శతాబ్దము ఒక ప్రధాన ఘట్టము. కవితాకన్యక, ముగ్ధమై, అసందిగ్ధమైన, కౌమార, వయో మాధుర్యమును మీరి, తొలి ప్రాయపు తళుకులు, అందరినీ ఆకర్షించు బెళుకులు నేర్చుకొను కాలమిది. నిర్లక్ష్యపు నెరసులు, పలుకుల బిరుసులు నిండిన రచనలప్పటివి. భావములలో ప్రశాంతి కంటే, నెమ్మది కంటే, ఆత్రమూ ఆ వేగమూ ప్రబలంగా తోచిన వాతావరణ మది. కవులకు లోక కల్యాణాని కంటే ఆత్మకల్యాణంలో అభినివేశ మెక్కువ; తపస్సు కంటే ధీరత్వం ప్రబలం. కనికరముకల ఆచారత్వాని కన్నా ఆగ్రహంతో నిండిన ధీరత్వంతో నిండిన ఆచారపుంస్త్వం ఎక్కువ వ్యాపించిన జీవిత మప్పటి కవీశ్వరులది. పాల్కురికి సోముడు, నాచన సోముడు మొదలైన వారారాధించిన ఈ కవితామార్గము బమ్మెర పోతన్న, శ్రీనాథుడు, పినవీరభద్రుడు మొదలగు మహానుభావుల రచనలో పండింది. తాళ్లపాక అన్నమాచార్యులు ఈ అగ్రగణ్య పంక్తికి చేరినవాడు.

ఒక విధంగా చూస్తే ఆ పంక్తిలో ఇతడే అగ్రగణ్యు డనవచ్చును. తెలుగులో పదకవిత్వం రచించిన వారిలో ఇతని కంటే ప్రాచీనులు మనకు గోచరింపరు. గేయ కవిత మనుష్యులకు సహజమై పరమ ప్రాచీనమైన రచన నిజమే. కనుక, ఇతర భాషలవలె తెలుగులోనూ అనాదిగా పాటలు రచించిన

స్త్రీ పురుషులు ఎందరో ఉండి వుంటారనేదీ సంభావ్యమే కానీ, అవన్నీ కాలగర్భంలో మరుగునపడి పోయినవి. ఉన్నవాని కాలప్రమాణం మనకు తెలియదు. కృష్ణమాచార్యుని సింహగిరివచనాలు అన్నమయ్యకు ముందే పుట్టినా, అవి గేయరచనలే ఐనా, అవి అంగాంగి విభాగం లేక అఖండ గద్యధారగా, గేయగంధులుగా మాత్రమే ఉన్నవి. ఆ గానగంధం కూడా మనదాకా రాక ఎప్పుడో అంతరించింది. పదునైదన శతాబ్దానికి కొంచెం ముందుగా కన్నడ భాషలో, ముఖ్యంగా వైష్ణవదాసుల రచనలలో పదకవిత ఒక అచ్చు కట్టైన స్వరూపాన్ని సంపాదించుకొని నిలిచింది. ప్రాచీన సంగీత లక్షణ గ్రంథాలు చూస్తే, ప్రబంధాలనబడే గేయరచనలు మనదేశంలో అసంఖ్యాకంగా ఉండేవనీన్నీ, రాగం, తాళం, శబ్దం, అర్థం, సందర్భం మొదలైన వాటిని బట్టి ఆ రచనల్లో ఎన్నో భేదం లేని విభాగాలు ఏర్పడి వుండేవనీన్నీ తెలియవస్తుంది. ఆ చాదస్తాలన్నీ వదిలిపెట్టి, సుప్రసిద్ధమైన దేశిరాగాలలో, సుగ్రహమైన లయ, తాళాలలో నిబంధించి సులభీకరించిన రచనలే పదాలు.

పదానికి రెండే అంగాలు. పల్లవి, చరణం, అర్థాన్నిబట్టి చూస్తే ముఖ్యమై కేంద్రభూతమైన అర్థం పల్లవిలో ఉంటుంది. దాని విస్తరణమే వివరణమే చరణంలో నిబంధింపబడుతుంది.

> **“ఎండగాని నీడగాని యేమైనగాని**
> **కొండలరాయడే మా కులదైవము ”**

అనేది పల్లవి. ఈ అర్థాన్నే వేరు వేరు శబ్దార్థాలతో పెంచి, పెద్దచేసి,

> **“ తేలుగాని పాముగాని దేవపట్టయినగాని**
> **గాలిగాని ధూళిగాని కాని యేమైనా,**
> **కాలకూట విషమైన గ్రక్కున మ్రింగిన నాటి**
> **నీలవర్ణుడే మా నిజ దైవము. ”**

అని రచించింది చరణం. పల్లవి భావం ఒక వాక్యంలో ముగియకపోతే రెండవ వాక్యాన్ని అను పల్లవిగా చేర్చి రచించేది కద్దు. "తన కర్మమెంత చేతయు నంతే" అనేది పల్లవైతే "గొనకొన్న పని యెంత కూలి నంతే" అనే రెండవ ఉపస్కారక వాక్యం అనుపల్లవిగా భావించబడుతుంది. ఇట్లే ఒక చరణంలో చేసిన పల్లవి వాక్యార్థ విస్తరణం చాలదని తోచి నప్పుడు అట్టివే మరికొన్ని చరణాలు చేర్చవచ్చును. ఆ కాలంలో ప్రాయికంగా ఒకపదానికి మూడు చరణాలుండేవి. కడపటి చరణంలో కర్త ముద్ర చేర్చేవారు. మరి సంగీత దృష్టిలో చూచినప్పుడు తాళలయాలు రెండూ ఆద్యంతం ఒకటే రీతిగా గోచరిస్తుంది. పల్లవిలో పొటమరించిన రాగభావం చరణంలో సర్వాంగీణంగా విస్తరింపబడి, కడపటి పల్లవి యెత్తుగడ నందుకొని లయించిపోతుంది. ఎన్ని చరణాలు రచించినా వాటి రాగస్వర సంచారక్రమం ఒకేతీరుగా ఉంటుంది. దీనికి విరుద్ధంగా ప్రతి చరణానికీ రాగతాళాలు వేరు వేరుగా ఏర్పరచి చేసిన "సూళాదులు" అనే పదాలు ఎన్నో 15-16 శతాబ్దాలలో కన్నడ భాషలో పుట్టినవి కాని అవి వ్యాప్తికి రాక అడుగున పడిపోయినవి ఈ పదస్వరూపాన్ని రచనకై పరిగ్రహించిన తెలుగు బయకార్లలో ఇప్పటికి అన్నమాచార్యులే ప్రాచీనతముడుగా కానవస్తున్నాడు. పదకవితాపితామహుడని తరువాతి వారు అతని బిరుదు పేర్కొన్నారు. ఇతనికి తర్వాత కొంత కాలంలోనే ఆంధ్రకవితాపితామహ బిరుదాన్ని సంపాదించుకొన్న అల్లసాని పెద్దన్న గూడా ఇతని వలె నందవరీకనియోగి కావడం - ఇతని వలెనే శ్రీవైష్ణవమత స్వీకారం చేసినవాడు కావడం కొంత వింత గొలిపే సందర్భాలు.

పద్యరచనకూ, పదరచనకూ మూల ద్రవ్యమందే ఎంతో భేదమున్నది. పద్యాలది అక్షరచ్ఛందస్సైనా, మాత్రాచ్ఛందస్సైనా మొత్తం మీదనే తప్ప దాని భాగాల మీద కవికి దృష్టి వుండదు; ఉండ నక్కర లేదు. అక్షరసంఖ్యగాని మాత్రాగణ సంఖ్య గాని భావానుసారంగా ఎక్కడనైనా తెంచివెట్టవచ్చును; ఎంత దూరమైనా లాగవచ్చును. రాగం చేర్చుకొని పద్యాలు చదివే రుచిగలవారు ఏ అక్షరాన్నైనా అర్థం చెడకుండా వుంటే సరి - ఎంత పొడవుగానైనా సాగదీయవచ్చును. అంటే అందులో లయబంధం లేదన్న మాట. పదాలలో

అట్లు చేసే వీలులేదు. ఇక్కడ ప్రధానమైనవి పాదాలు, పాదమధ్యాలు, వాటి అవాంతర ఖండాలు. మొత్తం తాళాల్నే కాక దాని ఖండాలను గూడ ఆయా జాతికి తగినట్లు ఒత్తి చూపెట్టవలయును. స్వరానికి శ్రుతి యెంత ముఖ్యమో, తాళానికి లయ అంతే ముఖ్యం. కనుక తాళము యొక్క ఆదిమధ్యాంతాలు కలిసి వెనుక ముందులు కాకుండా సాహిత్యాన్ని పదంలో నడపవలసివుంటుంది. ఆ విభాగాలను వినేవారికి స్పష్టంగా అందిచ్చే పని యతి ప్రాసలది. తెలుగు పద్యరచనలలోను యతి ప్రాసలున్నా అవి ఉన్నవనిపిస్తే చాలునని లాక్షణికులు ఉదారంగా తృప్తిపడతారు. అట్లు తృప్తిపడక లయ నిర్బంధం చేస్తే ఏ కవీ గట్టెక్కలేడు. ఏ కథను గాని, ఏ దీర్ఘభావాన్ని గాని ఛందస్సులో పాదిగించలేడు. పదకవిత్వంలో అట్లాగాక తాళలయాలు ప్రబలమై యతి ప్రాసలను స్పష్టంగా చూపి, ఆయా చోట్ల పదాలే కాక వాక్యాలుగూడ కత్తిరించి, పూర్వోత్తర ఖండాలను పొందికను సామరస్యాన్ని ఎత్తిచూపవలసివుంటాడు రచయిత. కనుక, "పెంపేదం దమకట్టి తక్కువలు రూపింపంగనేలా, విచారింపన్ వారిక మేలు సంధి, తమువారిం జూచిన౯ దారు సాధింప జాలరొ కాక పోరఁదగ మర్దింపం దలంపేని శంకింపం బట్టొకొ వారు బ్రాహ్మణులె యే కీడైన సైరింపంగ౯" అని పద్యం ఈడ్చినట్లు ధారాళశైలిలో పదం రచింప వీలు లేదు, మరి.

**కలలోని సుఖమైన – కలియుగమా, వెన్న**
**కలిలో నెక్కడిదె – కలియుగమా**
**కడిగడ గండమై కాలము గడపే వు**
**కడుగ కడుగ రొంపి – కలియుగమా**
**బడలిక వాపవు – పరమేదో చూపవు**
**గడిచేటి మును నీవు – కలియుగమా.**

అన్న రీతిగా శబ్ద వాక్యాలు అమర్చవలసి వుంటుంది పదంలో. కనుక పద్యరచనకూ, పదరచనకూ ప్రమేయంలో కొంత భేద ముండక తప్పదు. దాని ఫలంగా మన దృష్టికూడా భిన్నంగా ఉండవలసింది విధి; అధిక పదములు

పునరుక్తులు మొదలైన వాటిని పద్యంలో నిరసించినంత తీవ్రంగా పదంలో నిరసించరాదు. స్వతంత్రమైన ధారాళత గల పద్యరచనలో అర్థభావాలకు కవి చూపగలిగినంత అఖండత, వైశాల్యం, సూక్ష్మత, వైవిధ్యం మొదలైన గుణాలు పదరచనలో చూపలేడు. మరి రాగతాళాలు, సూత్రాలు బొమ్మనాడించినట్లు, అర్థభావ భావనలను పట్టి చూప గలిగిన పదరచనలో ఉన్నంత వర్చస్సు, శక్తి, ఆకర్షణ పద్యరచనలో రాదు. ఈ రెండు రకాల రచనల ననుభవించడంలో ఈ దృష్టిభేదం చాలా ముఖ్యం.

మరి అన్నమయ్య తన జీవిత మందలి తపస్సుకు మూలద్రవ్యంగా పదకవితను పరిగ్రహించాడు. సంస్కారసిద్ధమై సహజమైన కవితాశిల్పం, ఎప్పుడూ పదను చెడని భావనాశక్తి కలవాడు. స్వతః ఉద్రిక్తమై భావవేగాలను అణుచుకోలేని ప్రకృతి. దాన్ని సర్వాత్మనా శ్రీవేంకటేశ్వరుని కర్పణం చేసినవాడు. వేంకటేశ్వరుడే పరమతత్త్వమనే నిశ్చలమైన గట్టి నమ్మిక ఎవరి పుణ్యాననో ఇతనికి లంభించింది. ఆ మూర్తినే ఆధి భౌతికమైన, ఆధ్యాత్మికమైన సర్వ ప్రపంచం లోనూ అంతర్యామిగా, బహిర్యామిగా భావించి, పూజించి, ప్రేమించి, కలహించి, ప్రాధేయపడి, ప్రార్థించి, పొగడి, తెగడి, అనుభవించి ఏకీభవించి, జీవితంలో అంతరంగ బహిరంగ పరమాణువు లన్నిటా అతని బ్రతుకే బ్రతికినవాడు. ఆ అనుభవాలన్నీ మానసికంగా, కాయికంగా మాత్రమే కాక, వాచికంగా కూడా అనుభవించినవాడు. ఆ వాచికానుభవాలే ఆయన పదకవితలు.

ఆ కాలపు కావ్యప్రపంచమే ఉద్రేక ప్రధానమై, స్వతంత్ర ప్రీతి కలదని చెప్పితిని. మనస్సుకు నచ్చిన భావాన్నిగాని, అది రూపుగొన్న భాషాశయ్యారేఖలను గాని ఒకటి రెండు సార్లయినా నెమరువేసి సవరించి తీర్చి పెట్టే క్షమ అప్పటి కవులకు చాలదనిపించకపోదు. పాల్కురికి సోముని నిష్కళంక శివభక్తి, పోతనామాత్యుని కరగి కరగించే కృష్ణప్రేమ, శ్రీనాథుని సర్వంకషమైన రసభావముల చొరవ ఇవన్నీ ఆ కర్త లింక కొంత ప్రశాంత

హృదయంతో మననం చేసి రచించి వుంటే ఎంత అలౌకికంగా, అనిర్వచనీయంగా ఉండేవో అనే కొదవ నామట్టుకు నాకు పలుమారు కలుగుతూ వుంటుంది. ఆ వీధులలోనే తిరిగి తేరిన అన్నమయ్య రచనలోనూ ఆ ధర్మాలు కానిపింపక మానవు. అందందు పదపాదపూర్తి కి మాత్రమే పనికి వచ్చే భావాలు, యతిప్రాసలకై తెచ్చి మెత్తిన తేపమాటలు, ఆక్రోశంతో ఆలోచన కవకాశమీయక చెప్పిన అభిప్రాయాలు ఇతని పదాలలో లేకపోలేదు. కాని, యితని కవిత విషయప్రధానము కాక విషయి ప్రధానమైనది. అంటే ; ఇతర వ్యక్తుల కంటె, వారి అనుభవాలకంటె తన అంతరంగ బహిరంగానుభవాలనే ముఖ్యంగా వెలువరించేది. ఇట్టి విషయి రచనకు వర్చస్సునిచ్చే గుణం ఆర్జవం. ఆర్జవం అంటే తాను అనుభవించిన భావాలనే వెలువరించే అకృత్రిమ స్వభావం. ఇతరుల మెప్పులకో సంప్రదాయ సంరక్షణకో ఆశపడి తన మనస్సులో నిజంగా లేని భావాలను ఆరోపించుకొని రచనా వ్యాపారం సాగించే సంత పని కాదు. ఆ ఆర్జవగుణమే వ్యవహారం లోనూ, కవితలోనూ, భావాలకు తీవ్రతను, భాషకు పదునైన తీర్పును ఈయగలిగేది. ఆ ఋజుత్వమే జీవధర్మంగా బ్రతికినవాడు అన్నమయ్య. తన్ను సర్వవిధముల గౌరవించి పూజించిన ప్రభువు సాళ్వనరసింగ రాయుడు తనమీద ఒక్క పదం రచించి పెట్టమని వేడగా "హరి ముకుందుని గొనియాడు నా జిహ్వనినుగొనియాడంగ నేరదెంతైన -నను నెట్లు పలికితీ నైచ్యంపుఁబలుకు ?" అని తిరస్కరించి సంకెళ్లతో చెరసాల అనుభవించినవాడు. ఆ నిష్కల్మష భగవద్భక్తి బలం చేతనే ఆ సంకెళ్లను తెంచుకొని బైటబడినవాడు.

కనుక అన్నమాచార్యుల పదకవితలో మనలను సంక్రమించి పరవశపరిచే భావబలం, భాషతీర్పు, అనుభవాల లోతు, వైవిధ్యం - ఇంకే పదకవి రచనలోనూ కానరాదు.

---

అన్నమయ్య సంకీర్తనల్లో లభ్యమైన ఒకే ఒక్క "దేశిసూళాదిని" పరిష్కరించి, స్వరరచన చేయించి *1978*లో మ్యూజిక్ అకాడెమీలో సమర్పించినాను. అది పలువురు సంగీత రసికుల మన్ననలకు పాత్రమయినది. ( కా. శ్రీ )

పాపినైన నాపాలగలిగి త్రోవ-
చూపుమన్న నెందుఁజూపరు.

ధృతి దూలి జగమెల్లఁదిరిగి వేసరితి
ఇతరాయముల కేగి వేసరితి
గతిమాలి పరులపైఁ గనలి వేసరితి
మతిమాలి కులవిద్య మాని వేసరితి

విసిగి యాచారంబు విడిచి వేసరితి
పసచెడి ప్రియములు పలికి వేసరితి
కొసరి ద్రవ్యంబు పైఁ గోరి వేసరితి
కసుగంది లోలోనె కాఁగి వేసరితి

కోవిదులగు వారిఁ గొలిచి వేసరితి
దైవము లందరిఁ దగిలి వేసరితి
శ్రీవేంకటేశుని సేవమాని వట్టి
సేవలన్నియును సేఁజేసి వేసరితి

ఈ పదం రచించినవాని హృదయంలో ఎక్కడైనా కృత్రిమత్వం కలదని యెవరు చెప్పగలరు? అధ్యాత్మ శ్రద్ధ దృఢంగా కలవారి ఆధిభౌతిక జీవితంలో ఈ రెండు తత్వాలకూ కల పరస్పర విరోధం తెంచరాని చిక్కు. ఈ పోరాటంలో చిక్కి నలిగే వారికి ఎన్ని విధాల ఆశ, నిరాశ, నమ్మకం, సందేహం, తృప్తి, వేసట, కోపం, దీనత, దుఃఖం ఆనందం మొదలైన భావాలు కలుగునో అవన్నీ అన్నమాచార్యుల పదాలలో స్థిరంగా ప్రతిఫలించి ఉన్నవి.

ఆధి భౌతికానుభవములలో అన్నమాచార్యులు ఎక్కువగా భావించింది శృంగారం. దాన్ని గూడా అధ్యాత్మికపు మట్టాని కెక్కించిన మహాపురుషుడాయన. ఆయన రచించిన శృంగారపదాలు ఒక విశాల విశ్వం వంటివి. వాటి అసాధారణ సౌందర్యం ప్రత్యేకంగా చర్చించ వలసింది.

ఈ పదమొక్కటి గమనిస్తే తరువాతి శృంగార కవులకన్న అతడెంత ఎత్తులో నున్నాడో గ్రహింపగలము. ఇదొక విరహిణి యవస్థ. చెలికత్తె మాట :

నిన్ను బాసిన యట్లు నెలతకు వియోగదశ
లెన్నడను దోప విదియేమొ కాని

నినుదలచి లలితాంగి నీ రూపమాత్మలో
గని నీవు సవి బయలు కౌగిలించినది
తనర నాకాశ తత్త్వము నీ మహత్త్వమని
వనిత యెవ్వరి చేత వినెనో కాని

నిను బొగడి నీ రూపు కనుదోయి కెదురైన
తనివి దీరక బయలు తగ జూడ దొడగె
మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను
వెనకకే భావమున వినెనొకాని


తలపునను వాక్కునను తలపదలపగ నీవు
కలసి యా కమలాక్షిఁ గౌగిలించితివి
తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింట
గలవనెడిమాట నిక్కంబులో కాని.

ఇట్లే శ్రీవేంకటేశ్వరుని డోలావిహారం, గుర్రపుస్వారి,గరుడయాత్ర మొదలైన ఆటలన్నిటినీ వట్టి వినోదాలుగా గాక విశ్వలీలావిహారాలుగా కలిపి చిత్రించి అనుభవించినా డన్నమయ్య. మనం అనుభవించితే ధన్యుల మౌతాము. ఈ పదాలు పాడుకోగలిగితే సరే. పాడలేనివారికినీ, పద్యాలుగా చదువుకొని ఆనందింప గలిగినంత స్వతంత్రమైన అర్థభావ రచనల అందచందాల నిండిన నిధులివి.

- వాణి సం.సం. 5.22.7.1955 నుండి ఉద్ధరింపబడినది.

# అన్నమాచార్యులు

రచన : కామిశెట్టి శ్రీనివాసులు          చిత్రాలు : బాపు



అదిగో తెలుగుతల్లి తన కన్నబిడ్డకు గోరుముద్దలు తినిపిస్తూ పాడుతూంది.


" చందమామ రావో జాబిల్లి రావో, మంచి
కుందనంపు వైడికోర వెన్నపాలు తేవో "

ఈ చందమామ పాట వ్రాసిందెవరో తెలుసా ! తాళ్లపాక అన్నమాచార్యులు. వేంకటేశ్వరస్వామికి గొప్పభక్తుడు . మహా కవి. మన తెలుగులో తొలి వాగ్గేయకారుడు. వాగ్గేయకారుడంటే పాటలు స్వయంగా వ్రాసి పాడేవాడని అర్థం. వేంకటేశ్వరుడు అన్నమయ్య మేలుకొలుపు పాట పాడుతూంటే విని నిద్రలేచేవాడు. మళ్లీ ఆయన జోలపాట పాడందే నిద్రపోడు. స్వామికే గాదు అమ్మవారికి కూడ అన్నమయ్య పాటలంటే చాలా ఇష్టం. ఆయన పాడుతూంటే అలమేలు మంగమ్మ ఆనందంతో నాట్యం చేసేది.

సుమారు ఆరువందల ఏండ్ల క్రితం నాటిమాట. కడపజిల్లా రాజంపేట


తాలుకాలో తాళ్లపాక అనే గ్రామం ఉంది. అక్కడ రెండు గుళ్లున్నాయి. ఒకటేమో చెన్నకేశవస్వామి గుడి, ఇంకొకటి సిద్ధేశ్వరస్వామి దేవళం. చెన్నకేశవస్వామి విగ్రహాన్ని జనమేజయ మహారాజు ప్రతిష్ఠ చేశాడు. ఈ స్వామిని దేవతలు, ఋషులు, సిద్ధులు ప్రతిరోజు వచ్చి పూజిస్తారు. ఈ చెన్నకేశవస్వామి గుడిని ఆశ్రయించుకొని కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు జీవించేవి. వాళ్లలో నారాయణయ్య చాల ప్రసిద్ధుడు. ఇతని నాలుగో తరంలో మరో నారాయణయ్య ఉండేవాడు. ఈ నారాయణయ్య కథతోనే మన అన్నమయ్య కథ మొదలౌతుంది.

నారాయణయ్యకు చిన్నతనంలో ఎంతకీ చదువు రాలేదు. తండ్రి నయాన భయాన చెప్పి చూశాడు. లాభం లేక పోయింది. తన వద్ద ప్రయోజనం లేదని ప్రక్కనే ఊటుకూరులో తన బంధువుల వద్ద ఉంచాడు. అక్కడ బళ్ళో ఉపాధ్యాయులు శత విధాల ప్రయత్నించారు. నారాయణుని కళ్లల్లో నీళ్లే తప్ప నోట సరస్వతి పలకలేదు. వాళ్లు విసిగిపోయి బాలుని రకరకాల శిక్షలకు గురి చేశారు. కోదండం వేశారు, కోలగగ్గెర తగిలించారు. నారాయణయ్య లేత మనస్సు గాయపడింది. నలుగురూ అవహేళనా చేస్తున్నారు. సిగ్గుతో, అవమానంతో క్రుంగిపోయాడు. ఇంతకంటె చావు మేలను కున్నాడు. ఎవరో చెబుతుండగా విన్నాడు, ఊరి చివర చింతలమ్మ గుడి పుట్టలో పెద్ద పామున్నదని. నారాయణుడు ఒంటరిగ గుడి చేరి పుట్టలో చేయి పెట్టాడు. పాము కరవలేదు సరిగదా ! ఎదురుగ చింతలమ్మ ప్రత్యక్షమైంది. నారాయణయ్య ఏడుస్తూ ఆమె పాదాల మీద పడ్డాడు. చింతలమ్మ ఆ బాలుని తన ఒళ్లో చేర్చుకొని వూరడించింది. "ఎందుకు బాబు ఈ అఘాయిత్యం ? నీ మూడోతరంలో గొప్ప హరి భక్తుడు జన్మిస్తాడు, అతని వల్ల మీ వంశమే తరిస్తుంది. నీకు చదువు రాకపోవడమేమిటి వెళ్లు. తాళ్లపాక చెన్నకేశవస్వామే మీకు అన్నీ అనుగ్రహిస్తాడు" అని చింతలమ్మ బాలుని చింత తీర్చి అదృశ్యమైంది.



అమ్మ చెప్పినట్లు నారాయణయ్యకు చెన్నకేశవస్వామి దయవల్ల అన్ని విద్యలూ సిద్ధించాయి. ఈ నారాయణయ్య కుమారుడే నారాయణసూరి.నారాయణసూరి గొప్ప కవి, పండితుడు. ఇతని ఇల్లాలు లక్కమాంబ, మహాభక్తురాలు. మధురంగా పాడుతుంది. ఈమె స్వగ్రామం మాడుపూరు తాళ్లపాక సమీపంలో ఉన్న గ్రామం అక్కడ చెన్నకేశవస్వామి ఈమెతో ప్రత్యక్షంగా మాట్లాడేవాడట. ఈ పుణ్య దంపతులు సంతానం కోసం చేయని వ్రతం లేదు. కొలవని దేవుడూ లేడు. " మాకు మంచి కొడుకును ప్రసాదించు స్వామీ " అని ఏడు కొండలస్వామికి మ్రొక్కుకున్నారు. ముడుపులు కట్టుకున్నారు. ఒక మంచిరోజు చూసి ఇద్దరూ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ప్రయాణమయ్యారు.

లక్కమాంబ,నారాయణసూరి తిరుమల చేరారు. స్వామిమందిరం ప్రవేశించారు. గరుడగంభం వద్ద సాగిలి మ్రొక్కారు. వాళ్ల కేదో మైకం కమ్మినట్లైంది. కళ్లు మిరుమిట్లు గొలిపే తేజస్సు కనిపించి ధగధగమెరిసే ఖడ్గాన్ని వాళ్ల చేతుల్లో పెట్టి అదృశ్యమైంది. వేంకటేశ్వరస్వామి తన ఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్య దంపతులకు ప్రసాదించాడు. వాళ్ళు పరమానందభరితులయ్యారు. వేంకటపతిని దర్శించి స్తుతించారు. సంతోషంతో తాళ్లపాకకు తిరిగి వచ్చారు.



లక్కమాంబ గర్భవతి అయింది. వైశాఖమాసం విశాఖ నక్షత్రంలో, ఒక శుభలగ్నంలో మూడు గ్రహాలు ఉన్నత దశలో ఉండగా మగశిశువు ఉదయించాడు. అంటే క్రీ.శ.1408లో అన్నమాట. హరినందకాంశంలో జన్మించిన ఆ హరిభక్తునికి అన్నమాచార్యులు అని నామకరణం చేశారు. అన్నమయ్య బోసి నవ్వులు ఒలకబోస్తూ నలుగురినీ మురిపించేవాడు. మాటి మాటికి వెంకటప్పకు జోతలు పెట్టేవాడు. వెంకన్న పేరు చెబితేనే ఉగ్గుపాలు త్రాగేవాడు. వెంకటపతిమీద జోలపాట పాడందే నిద్రపోడు. లక్కమాంబ భక్త గీతాలు పాడుతూంటే ఏదో అర్థమైనట్లు తల పంకించే వాడు. నారాయణసూరి కావ్యాలలో అర్థాలు నలుగురికి వివరిస్తూ వుంటే తానూ ఊః కొట్టేవాడు.

అన్నమయ్యకు ఐదేండ్లు నిండాయి. అతను ఏకసంధాగ్రాహి. గురువులు చెప్పిన పాఠాలు చెప్పినట్లు వెంటనే అప్పచెప్పేవాడు. వాళ్లు ఆశ్చర్యపడేవాళ్లు. ఇంక అన్నమయ్యకు నేర్పించ వలసింది ఏమీ లేదని త్వరలోనే తెలుసుకున్నారు. అన్నమయ్య ఆడిందెల్లా అమృతమయమైన కావ్యంగా, పాడిందెల్లా పరమగానంగా వినిపించేది. అన్నమయ్య చెన్నకేశవుని గుడిచేరి "బుజ్జి కేశవా!" అని పిలిచేవాడు.

బుజ్జిబాలుని ముద్దు మాటలకు మురిసి చెన్నకేశవుడు సిరినవ్వులు చిందించేవాడు. అన్నమయ్య ఎప్పుడూ ఆటల్లో పాటల్లో మునిగి తేలేవాడు. చెరువు కట్టలమీద చేరి చెట్టుమీది పిట్టలతో గొంతు కలిపేవాడు. చిరుగాలుల సవ్వడికి మురిసేవాడు. చెరువులోని అలలలో ఉయ్యాలలూగే కమలాలను చూస్తూ గంతులేసేవాడు. కన్నె పిల్లలు వెన్నెల రోజుల్లో జాజర పాటలు పాడుతూంటే అక్కడ చేరుకొని వాళ్లను అల్లరి పెట్టేవాడు. రాగం పాడీ, తాళం వేసీ చూపేవాడు. "మీకేం తెలీదు పొమ్మ" ని ఎగతాళి చేసేవాడు. కలుపు పాటల్లో, కవిల పాటల్లో జానపదులతో బాటు శ్రుతి కలిపేవాడు. అన్నమయ్య మాటన్నా పాటన్నా ఆ వూరి వాళ్లు ఎంతో సంబరపడి పోయే వాళ్లు.



నారాయణసూరిది పెద్ద కుటుంబం. ఉమ్మడి కుటుంబాలలో చిన్న చిన్న కలతలు తప్పవు. వాళ్ల కోపతాపాలు అర్థం లేనివి, ఇంతలో తగవులాడుతారు. అంతలో కలిసిపోతారు. ఒకనాడు అందరు కలిసికట్టుగ అన్నమయ్య మీద విరుచుక పడ్డారు. అన్నమయ్యకు దిక్కు తెలియలేదు. "ఎప్పుడూ ఆ దండె భుజాన తగిలించుకొని పిచ్చి పాటలు పాడుకోవడమేనా? ఇంట్లో పనీ పాట ఎవరు చూస్తారు ? " అని ఇంటివాళ్లు దెప్పి పొడిచారు. " గాలి పాటలు కట్టి పెట్టి, అడవికెళ్లి పశువులకింత గడ్డి తెచ్చిపడేయ్. "

ఏ విసుగులో వున్నాడో నారాయణసూరి కొడుకును కసరినంత పనీ చేశాడు. లక్కమాంబ మాత్రం కొడుకు వైపు జాలిగ చూసింది. అన్నమయ్య ఏమీ బదులు పలకలేదు. కొడవలి భుజాన తగిలించు కొని అడవికి బయలు దేరాడు. అన్నమయ్యకు అడవి కెళ్లడం అలవాటు లేదు. ఒక చెట్టు కింద చతికిలబడ్డాడు. తంబుర చేతిలోనే వుంది. తీగ సవరించి పాడబోయాడు. పక్కన కొడవలి వుంది. దాన్ని చూస్తూనే వచ్చిన పని గుర్తుకు వచ్చింది. లేచి చుట్టూ పరికించాడు. ఒక చోట పచ్చిక బాగా బలిసి వుంది. కొడవలితో కోస్తున్నాడు. ఉన్నట్లుండి "అమ్మా!" అని కేక పెట్టాడు. చిటికెన వ్రేలు తెగి రక్తం బొటబొటా కారుతున్నది. రక్తం చూస్తూనే కళ్లు తిరిగి పోయాయి. బాధతో మూలిగాడు. ఈ అవస్థకు కారణం ఎవ్వరు ? ఒక్కమారు తన బంధువుల్ని తల్లిదండ్రుల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. "అంతా అబద్ధం. తనకు ఎవ్వరూ లేరు. లౌకిక బంధాలతో తనకు పనిలే "దనుకున్నాడు. దూరాన తిరుపతికి వెళ్ళే యాత్రికుల గుంపు కనిపించింది. వాళ్లు ఆడుతూ పాడుతూ వెళ్తున్నారు. చేతిలో వున్న కొడవలి విసిరేశాడు. తంబుర చేత పట్టుకొని ఆ గుంపులో కలిసి పోయాడు.



ఆ యాత్రికులు ఎవ్వరో కారు, సనక సనందాది మహాభక్తులు. వాళ్ల వేషం తమాషాగా వుంది. జింక చర్మంతో చేసిన కిరీటాలు పెట్టుకున్నారు. అభ్రకము, ఆకులు, కలిపి కుట్టిన బట్టలు వేసుకున్నారు. నొసట పట్టెనామాలు, శంఖ చక్రాల ముద్రికలు, కాళ్లకు కంచు అందెలు, చేతిలో బాణాలున్నాయి. దండెలు మీటుకుంటూ, చిటి తాళాలు వాయిస్తూ మద్దెల మ్రోగిస్తూ భక్తి పారవశ్యంతో పాడుతూ చిందులేస్తూ మధ్యలో " గోవింద ! గోవింద! " అంటూ నినాదాలు చేస్తున్నారు. అన్నమయ్య వాళ్లతో కలిసి తిరుపతి చేరాడు.

తిరుపతి చేరుతూనే గంగమ్మ గుడికెళ్లాడు. గ్రామశక్తికి దండం పెట్టాడు. అలిపిరి చేరాడు. అక్కడ నరసింహస్వామికి నమస్కారం చేశాడు. అలిపిరి కొండను చుక్కల పర్వతం అని కూడా పిలుస్తారు. భగవంతుని చేరడానికి ఇది తొలిపాదం. ఇక్కడ "తలేరు గుండు "వుంది. ఆ గుండుమీద ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. అన్నమయ్య ఆ గుండుకు నమస్కరించాడు. ఈ గుండులో ఎన్నో మహిమలున్నాయట. కొండ ఎక్కే భక్తులు ఈ గుండును తలతో మోకాటితో తాకి దండం పెట్టుకుంటే తలనొప్పి, కాళ్లనొప్పులు ఉండవని నమ్మకం. ఎత్తుగ విశాలంగ వ్యాపించి వున్న పర్వత శిఖరాలను చూశాడు. అవి ఆదిశేషుని పడగల్లా కనిపించాయి. అక్కడి రాళ్లలో వేదాలు వినిపించాయి. తరువులలో మునులు కనిపించారు. మృగాలలో దేవతలు దర్శనమయ్యారు. పుణ్యరాసులే సెలయేళ్లై పొంగి పారలినవి. ఆనందంతో చిందులు త్రొక్కుతూ పాడసాగాడు.

**అదివో అల్లదివో హరివాసము**
**పదివేల శేషుల పడగలమయము**

**అదె వేంకటాచల మఖిలోన్నతము**
**అదివో బ్రహ్మాదుల కపురూపము**
**అదివో నిత్యనివాస మఖిలమునలకు**
**అదె చూడుఁడదె మ్రొక్కుఁడానందమయము**

**కైవల్య పదము వేంకటనగమదివో**
**శ్రీ వేంకటపతికి సిరులయినది.**
**భావింప సకల సంపదరూప మదివో**
**పావనముల కెల్ల పావనమయము**

వెంకటేశ్వరస్వామి విహరించడానికి అనువుగా ఆదిశేషుడు క్రీడా శైలంగా నిలచాడట.

ఆ బాలభక్తుడు కొండ ఎక్కుతున్నాడు. అలిపిరి గోపురం సమీపిస్తున్నది. అక్కడ కొండ కొంత నిటారుగ వుంటుంది. దానికి "పెద్ద ఎక్కుడు" అని పేరు. ఉత్సాహంగా అన్నమయ్య ఆ కొండ ఎక్కి గాలిగోపురం చేరాడు. కొంత దూరంలో కర్పూరపు కాలువ వుంది. అక్కడి నుండి కమ్మని వాసనలు వ్యాపిస్తున్నాయి. గుబురు గుబురుగ అలముకున్న చెట్లను, పొదలను, జలజలా ప్రవహిస్తూ ఒయ్యారంగ సాగిపోతున్న కొండవాగులను చూసుకుంటూ మోకాళ్ల కొండ చేరాడు. అక్కడ చేరేటప్పటికి మిట్టమధ్యాహ్నమైంది. ఎండకన్నెరగని పసిబాలుడు; ఎనిమిదేండ్ల వాడు, అన్నమయ్య అలసిపోయాడు. ఆకలిగ వుంది. శోష వచ్చినట్లైంది. దట్టంగ అలుముకున్న వెదురుపొదల కింద అలానే, చెప్పులకాళ్లతోనే వాలిపోయాడు. వెదురు బొంగులలో దూరి గాలి వేణువు లూదుతూ ఆ పసిబాలునికి జోలపాటలు పాడింది.




అన్నమయ్య అలసటను, ఆకలిని ఎవరు గమనించినా గమనింపక పోయినా అలమేలు మంగమ్మ గమనించి కరుణించింది. మంగమ్మ పెద్ద ముత్తైదువలా అన్నమయ్యను సమీపించింది. తన ఒడిలో చేర్చుకొని శరీరం నిమురుతూ " లే ! బాబు, లేచి ఇలా చూడు "అన్నది. అన్నమయ్యకు తన తల్లి లక్కమాంబ పిలుస్తున్నట్లనిపించింది. "అమ్మా! " అని లేచాడు. కాని కళ్లు కనుపించడంలేదు. అమృతంలాంటి అమ్మ స్పర్శ; తేనెలూరే తల్లి పలుకులు. అన్నమయ్యకు దిక్కు తెలియడం లేదు. దీనంగ " తల్లీ ! నాకు కళ్లు కనిపించడంలేదు" అన్నాడు. మంగమ్మ బాలుని ఊరడిస్తూ "బాబు ఈ కొండ సాలగ్రామ శిలలతో కూడుకొన్నది. చెప్పులు తొలగించి చూడు "అన్నది. అన్నమయ్య పాదరక్షలు తీసివేశాడు. పర్వతమంతా తేజస్సుతో విరాజిల్లుతున్నది. హరి దశావతారాలు క్రమంగా కనిపిస్తున్నాయి. అన్నమయ్య ఆశ్చర్యంతో, ఆనందంతో ఆపవిత్రమైన పర్వతానికి నమస్కరించాడు.అలమేలు మంగమ్మ అన్నమయ్యను దగ్గరకు తీసుకొని ప్రసాదాలను తినిపించింది. అన్నమయ్యలో సరస్వతీదేవి అంశ ప్రవేశించింది. తనకు తెలియకుండానే కవిత్వం పెల్లుబికింది. ఆవేశంతో ఆశువుగా ఒక శతకాన్ని అలమేలుమంగకు అంకితం చేశాడు. ఆ శతకంలో చంపకమాల, ఉత్పలమాల వృత్తాలు మాత్రమే వున్నాయి; అంటే సంపెంగలు, కలువలు అన్నమాట. పూలవంటి పద్యాలతో పూవుమీద ఉన్న మంగమ్మ పాదాలను అర్చించాడు. "అలమేలు మంగ "అంటె పువ్వుమీద నిలిచిన యువతి అని అర్థం.

" అమ్మకు తాళ్ల పాక ఘను
డన్నఁడు పద్యశతంబు నెప్పి కో
కొమ్మని వాక్ప్రసూనముల
కూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని య
నేకయుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్ధిలుము
జవ్వని లీలల వేంకటేశ్వరా !

అన్నమయ్య నేరుగా పుష్కరిణి వద్దకు వెళ్ళాడు. దీనిని స్వామి పుష్కరిణి అంటారు. సరోవరాలలో మహారాజు లాంటిది. ఈ పుష్కరిణిలో కొన్ని వేల పుణ్యనదుల నీళ్లు కలుస్తాయట. ఇక్కడ స్నానం చేస్తే పాపాలన్నీ పటాపంచలై పోతాయట. అన్నమయ్య ఆ పవిత్ర జలాలలో స్నానం చేశాడు.

అన్నమయ్య కొండెక్కి బాగా అలసిపోయాడా ! అక్కడ స్నానం చేస్తూనే అతనికి అన్ని నొప్పులూ తొలిగిపోయాయి. మనస్సు ఎంతో నిర్మలంగా వుంది. నేరుగ వరాహస్వామిని దర్శించుకున్నాడు. తిరుమలకు వరాహక్షేత్రం అని పేరు. అక్కడ ఆ వరాహస్వామి నివసించేవాడు. ఇతడే వేంకటేశ్వరస్వామికి కొండమీద ఉండటానికి అనుమతి ఇచ్చాడు. దానికి కృతజ్ఞతగ తొలుత వరాహస్వామి దర్శనం చేసుకున్న తర్వాతనే తన దర్శనం అని వేంకటేశ్వరస్వామి కట్టడి చేశాడు. తిరుమల క్షేత్రంలో ఇప్పటికీ తొలిపూజా నైవేద్యాలు వరహస్వామికే సమర్పిస్తారు.



అన్నమయ్య ఆదివరాహస్వామిని సేవించుకొని వేంకటేశ్వరస్వామి కోవెలకు వెళ్ళాడు. పెద్ద గోపురాన్ని ఆశ్చర్యంగా చూశాడు. అక్కడ పెద్ద చింతచెట్టుండేది. దానికి మ్రొక్కాడు. కోరిన కోరికలు తీర్చే గరుడగంభానికి

సాగిలపడ్డాడు. పెద్ద పెద్ద సంపెంగ మానులతో నిండి ఉన్న చంపక ప్రదక్షిణం చుట్టాడు. విమాన వేంకటేశ్వరుని దర్శించాడు. రామానుజులవారిని సేవించుకున్నాడు. యోగ నరసింహస్వామికి నమస్కరించాడు. వీరిని వరదరాజస్వామి అని గుడిలో వ్యవహరిస్తారు.జనార్ధనుని మూర్తికి మ్రొక్కాడు.నేడు వీరిని వరదరాజస్వామి అని గుడిలో వ్యవహరిస్తారు. వంట యింటిలో వెలసి ఉన్న అలమేలు మంగమ్మను అర్చించాడు. యాగశాలను దర్శించాడు. కల్యాణ మంటపాన్ని తిలకించాడు. వరుసగా వాహనమండపంలో ఉన్న ఆది శేషునికి మోకరిల్లాడు. గోవాదేశం నుండి తెప్పించిన తట్టు పునుగును బంగారు శలాకలకు గ్రుచ్చి కరగిస్తున్నారు. యాత్రికలు గుంపులు గుంపులుగా " గోవింద, ముకుంద, తిమ్మప్ప " అంటూ ప్రదిక్షిణాలు చేస్తున్నారు. బంగారు పంజరాలలో పంచెవన్నెల రామచిలుకలున్నాయి. " వేంకటపతిని సేవించుకోండి ; కానుకలు సమర్పించండి; కొండలప్పకు దండాలు పెట్టండి; మీరు కోరుకున్న కోరికలు అన్నీ సమకూడుతాయి" అంటూ ఆ చిలుకలు పలుకుతున్నాయి. స్వామి పట్టుపీతాంబరాలున్న శ్రీ భండారాన్ని చూశాడు. తన పంచెకొంగున అతి జాగ్రత్తగ దాచుకున్న ఒక కాసుతీసి, బంగారు గాదెలకు ( హుండీ ) నమస్కరించి, వడ్డికాసుల వానికి సమర్పించాడు.

అన్నమయ్య, స్వామి సన్నిధిలో బంగారు వాకిళ్ల వద్ద నిలిచాడు. శ్రీనివాసుని దర్శించాడు. అన్నమయ్య శరీరమంతా పులకాంకురాలు చెలరేగాయి. ఒళ్లంతా కళ్లు చేసుకొని చూస్తున్నాడు. ఒకచేతిలో చక్రం, మరొక చేతిలో శంఖం, బొడ్డులో మాణిక్యం, సూర్యకటారి, పాదాలకు అందెలు, పట్టుపీతాంబరం, కటి మీద ఒక చేయి, వరాలను ఇచ్చే వరద హస్తం, చెవులలో నవనవలాడే మణికుండలాలు, కళలను వెదజల్లే ముఖం, ముత్యాల నామం, ధగ ధగమెరిసే రత్న కిరీటం, శరీరమంతా పట్టించిన తట్టుపునుగు, కిరీటానికి ఇరువైపుల దిగవేసిన కలువపూదండ, వనమాల, శ్రీవత్సం, కౌస్తుభం, వెలలేని

ఆభరణాలు- వేంకటేశ్వరుని దివ్య మంగళ విగ్రహాన్ని అలానే తిలకించసాగాడు. అన్నమయ్య హృదయం ఉప్పొంగింది. అతని గొంతు నుండి కెరటాలు కెరటాలుగ భావగీతాలు వెలువడుతున్నాయి:

**పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము-**
**నెడయకవయ్య కోనేటి రాయఁడా,**

**కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల**
**నేరిచి పెద్దలిచ్చిన నిధానమా**
**గారవించి దప్పి దీర్చుకాల మేఘమా, మాకు**
**చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా !**

అన్నమయ్య పాట విని అర్చకులు ముగ్ధులైపోయారు. బాలుని దగ్గరకు తీసుకొని ప్రశంసిస్తూ తీర్థం, ప్రసాదం ఇచ్చి శఠకోపం తలమీద ఉంచారు. అన్నమయ్య ఆరోజు ఒక మండపంలో విశ్రమించాడు.

ఆ దినం ఏకాదశి. అన్నమయ్య కొండమీద ఉన్న దివ్యతీర్థాలను చూడడానికి వెళ్ళాడు. "కుమారధారా తీర్థాన్ని" చూశాడు. తారకాసురుని కుమార స్వామి చంపాడు కదా ! అందు కని బ్రహ్మహత్యాపాతకం అంటుకొన్నది. ఆ పాపం పోగొట్టుకోవడానికి షణ్ముఖుడు ఇక్కడే తపస్సు చేశాడట. తర్వాత "అమర తీర్థం" చేరాడు. ముక్కోటి దేవతలు ప్రతిరోజు ఈ తీర్థంలో స్నానం చేసి వెళ్తారట. అన్నమయ్య "ఆకాశగంగ" చూశాడు. పండ్రెండేండ్లు అంజనాదేవి తపస్సు చేసి హనుమంతుని కన్నచోటు. పాపాలను కడిగి పుణ్యాన్ని ప్రసాదించే "పాపవినాశం" జలపాతంలో స్నానం చేశాడు. ఈ తీర్థాలలో స్నానం చేస్తూ అన్నమయ్య ఒక గమ్మత్తు చేసేవాడు. స్నానం చేసి తన బట్టలు ఆరవేసేవాడు. అవి ఆరేంతలోగా ఒక శతకాన్ని ఆశువుగా చెప్పేవాడు.

ఒకరోజు అన్నమయ్య ఇలా స్నాన సంధ్యాదులు ముగించుకొని వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళ్ళాడు. కాని ఆలయం తలుపులు

మూసివున్నాయ్. ఆ బంగారు వాకిళ్ళకు తాళాలు బిగించారు. అన్నమయ్య చాలా నిరాశపడ్డాడు. ఎంతో ఆవేదనతో ఒక గీతాన్ని ఆలపించాడు. వెంటనే తాళాలు తెగిపడ్డాయి. కవాటాలు భళ్ళున తెరుచుకున్నాయి. అర్చకులు భయపడ్డారు. "అపరాధం అపరాధం" అని అన్నమయ్యను లోనికి పిలుచుకొని వెళ్ళారు. అన్నమయ్య అక్కడ వేంచేసి వున్న గరుడాళ్వారు, విష్వక్సేనులు, సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన భక్తులను, సీతారామలక్ష్మణ మూర్తులను దర్శించుకుంటూ వేంకటేశ్వరస్వామి ఎదుట నిలిచాడు. అపర వేంకటేశ్వరునిలా అర్చకస్వామి, స్వామిని పూజిస్తున్నాడు. ఆ సన్నివేశంలో అన్నమయ్య భావావేశం పొందాడు. వెంటనే ఒక పద్యశతకాన్ని సమర్పించాడు. స్వామి మెడలోని ముత్యాలహారం నేల పడింది. అర్చకులు సంభ్రమంతో బాలుని మహిమను కొనియాడారు. అపర శ్రీనివాసుడైన వైఖానసనంబి అన్నమయ్యను చూసి "వీడు సామాన్యుడు కాడు. కోనేటిరాయని దివ్యప్రసాదం" అన్నాడు. చందనం, తీర్థం, ప్రసాదం ఇచ్చి మనసార ఆశీర్వదించాడు. అన్నమయ్య కోనేటి ఒడ్డున కూర్చొని ప్రసాదాలు తిని స్వామి మహిమలను తలచుకొంటూ వరాహస్వామి కోవెలలో విశ్రమించాడు.

ఆ రోజుల్లో ఘనవిష్ణువు అనే వైష్ణవయతి తిరుమలలో ఉండేవాడు. అతడు మహాభాగవతుడు.మాధవసేవ చేస్తూ సాటి మానవులకు విష్ణుతత్వాన్ని బోధించేవాడు. తన శేషజీవితాన్ని శేషాద్రినిలయునికే అంకితం చేశాడు. ఆదినం ద్వాదశి. రాత్రి వేంకటపతి ఆ యతి కలలో కనిపించి -"తాళ్లపాక అన్నమయ్య అనే భక్తుడు రేపు నీ దగ్గరకు వస్తాడు. వాడు నల్లగ, అందంగ వుంటాడు. ఎప్పుడూ నామీద పాటలు పాడుతూ వుంటాడు. వాని చెవులలో మద్దికాయలు వ్రేలాడుతూ ఉంటాయి. పట్టుకుచ్చులున్న దండె భుజం మీద మోపి మీటుకుంటూ వుంటాడు. వానికి నీవు ముద్రధారణం చెయ్యి ; ఇవిగో నాముద్రికలు" అని అందించాడు.

మరునాడు ఉదయాన్నే స్నానసంధ్యాదులు ముగించుకొని ఘనవిష్ణువు స్వామి మందిరంలో యజ్ఞశాల వద్ద నిలుచున్నాడు. అతని చేతుల్లో స్వామి సమర్పించిన శంఖచక్రాల ముద్రలున్నాయి. అన్నమయ్య ప్రొద్దున్నే లేచి పుష్కరిణిలో స్నానం చేసి వరాహస్వామిని దర్శించుకున్నాడు. వేంకటేశ్వరుని తొలి ప్రాకారం చుట్టూ ప్రదిక్షిణం చేశాడు. హరినామ సంకీర్తన చేసుకుంటూ యజ్ఞశాల ముందుకు వచ్చాడు.ఘనవిష్ణువు ఆ బాలుని చూశాడు. వానిలో స్వామి చెప్పిన గుర్తులను చూశాడు. మెల్లగా బాలుని సమీపించాడు.

" నాయనా ! నీ పేరేమి? "

అన్నమయ్య యతికి పాధాభివందనం చేశాడు.

"అన్నమయ్య" ప్రవర చెప్పాడు.

యతి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"నీకు ముద్రధారణ చేస్తాను. సమ్మతమేనా ? "

అన్నమయ్య యతిముఖాన్ని చూశాడు. వేంకటేశ్వరుడే కనిపించాడు. "కృతార్థుణ్ణి" అన్నాడు.




ఘనవిష్ణువు వేదోక్తంగా అన్నమయ్యకు పంచసంస్కారాలు నిర్వహించాడు. సాటి వైష్ణవులకు అన్ని విషయాలు తెలిపాడు. వాళ్ళు తృప్తిపడ్డారు. అన్నమాచార్యుడు ఆవైష్ణవ పంక్తిలో కలసి భోంచేశాడు. అన్నమయ్య అన్నమాచార్యుడయ్యాడు.

అన్నమయ్య చెప్పాచేయకుండా తిరుమలకు వెళ్ళిపోయాడు. ఇక్కడ తాళ్లపాకలో తల్లిదండ్రులు కన్నబిడ్డ కోసం వెదకి వెదకి కానక క్రుంగిపోయారు. లక్కమాంబ చెన్నకేశవుని గుడివదలి రావడం లేదు " అన్నా ! అన్నా !" అని కలవరిస్తూనే వుంది . నారాయణయ్య వెర్రివాడిలా అయిపోయాడు.

ఆ రోజు ద్వాదశి. ఆ వూరివాళ్లంతా అన్నమయ్య కోసం గుళ్ళో ప్రత్యేక పూజలు జరిపించారు. లక్కమాంబ భజన చేస్తూచేస్తూ అలిసి సోలిపోయింది. మగతలో ఏదో గొణుగుతూంది -

" తిరుమలప్ప......... తిరుమలప్ప అన్నమయ్య, అన్నమయ్య !" నారాయణయ్య విన్నాడు. అతినికి ఏదో స్ఫురించింది. మరునాడు లక్కమాంబను పిలచుకొని తిరుమలకు బయలు దేరాడు.

తిరుమలలో అన్నమాచార్యుడు ఘనవిష్ణువు వద్ద విష్ణుతత్త్వాన్ని తెలుసుకుంటూ వుండేవాడు. ఆ యతి అన్నమాచార్యుని ఆదరంతో చూసేవాడు. గురువు చెప్పిన మాటలను మననం చేసుకుంటూ పాటలు పాడేవాడు శిష్యుడు. ఆ రోజు అన్నమాచార్యుడు దేవాలయం ముందు మండపంలో కూర్చుని తన్మయత్వంతో గానం చేస్తున్నాడు. వందలాది భక్తులు పారవశ్యంతో వింటున్నారు. తిరుమలకు చేరిన లక్కమాంబ, నారాయణసూరి కుమారుని కంఠం గుర్తుపట్టారు. వాళ్ళ సంతోషానికి అవధుల్లేవు. లక్కమాంబ "అన్నా" అంటూ ఆ గాయకుని వైపు పరుగెత్తింది. అమ్మ పిలుపు విన్న అన్నమాచార్యుని గానం ఆగిపోయింది. "తల్లీ " అంటూ అమ్మ ఒడిలో వాలిపోయాడు. తండ్రి నారాయణయ్య ఆనందంగా గర్వంగా తనయుని దగ్గరకు తీసుకున్నాడు. అన్నమాచార్యునిలో ఏర్పడిన మార్పును గమనించాడు. "స్వామీ ! వేంకటేశ్వర ! వీడు నీ వరప్రసాదం. నీవే కాపాడుకో!" అన్నాడు. ఘనవిష్ణువు వాళ్లను తన మఠానికి తీసుకొని వెళ్ళాడు.



ఆ రాత్రి లక్కమాంబ అన్నమాచార్యుని తాళ్లపాకకు రమ్మని బ్రతిమలాడింది. "తల్లీ ! నాకిక్కడే బావుంది. పెరుమాళ్లను వదలి నేనెలా రాను ? నన్ను మన్నించి ఆశీర్వదించు" అన్నాడు. అన్నమాచార్యుడు. తల్లి పట్టినపట్టువదలలేదు. అన్నమాచార్యునికి ఎటూ పాలుపోలేదు. తల్లిని కాదనలేడు. వేంకటప్పనూ వదలి వెళ్ళలేడు. ఇలా ఆలోచిస్తూ అన్నమాచార్యుడు నిద్రపోయాడు. కలలో ఒక తేజస్సు కనిపించింది. "అన్నా ! తల్లి మనసు కష్టపెట్టకు తాళ్ళపాకకు తిరిగి వెళ్ళు. నీకు సకల శుభాలు సమకూరుతాయి. పరచింతలుమాను. పరతత్త్వాన్ని తెలుసుకో" అన్న ప్రబోధం వినిపించింది. అన్నమాచార్యునికి అంతా అగమ్య గోచరంగా ఉంది. "ఇది స్వామి ఆదేశం" అని తెలుసుకున్నాడు. తల్లి దండ్రులతో కలసి తాళ్లపాకకు తిరిగి వెళ్ళాడు.

అన్నమాచార్యునికి పదహారేండ్లు నిండాయి. తల్లి దండ్రులు వివాహప్రయత్నాలు చేయసాగారు. ఎప్పుడూ పాటలు పాడుకొనే నామాల దాసరయ్యకు పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. అన్నమాచార్యుని లోకం వేరు. గుళ్ళూ గోపురాలు తిరుగుకుంటూ ఎప్పుడో ఇల్లు చేరేవాడు. కొన్నాళ్ళు ఇంటి ముఖమే చూసేవాడు కాదు. ఆ మహా భక్తుని ధోరణి, ధ్యాస

వేరు. కొన్ని విచిత్రమైన పరిస్థితుల్లో, భగవత్సంకల్పంవల్ల, అన్నమాచార్యుడు తిమ్మక్క, అక్కలమ్మ అనే ఇద్దరు కన్నెలను వివాహమాడాడు. అన్నమాచార్యుడు గృహస్థాశ్రమ ధర్మం నిర్వహిస్తూ భగవంతుని సేవలో నిమగ్నుడయ్యాడు.

అది క్రీ.శ.1424 క్రోధి సంవత్సరం వైశాఖ మాసం, విశాఖ నక్షత్రం అన్నమాచార్యుడు పుట్టిన రోజు. తిరుమలకు వెళ్ళాడు. స్వామిని దర్శించుకొని ఆ రాత్రి వరాహస్వామి గుడి ప్రక్కన ఉన్న మండపంలో విశ్రమించాడు. ఎంత సేపటికి నిద్రపట్టలేదు. వెంటనే తంబుర తీగె సవరించి పాటకు ఉపక్రమించాడు. ఏదో రాగమందుకున్నాడు. విచిత్రమైన అనుభూతి కలుగుతున్నది. హృదయంలో అలజడి ప్రారంభమైంది. భావంలో ఏవో బొమ్మలు అస్పష్టంగా కదలుతున్నాయి, నారదుని వీణా గానం వినిపిస్తున్నది. తుంబురుని పాట వినిపిస్తున్నది..... హఠాత్తుగ అన్నమాచార్యుని కంఠం నుండి ఒక కొత్త పాట అవతరించింది.

**బ్రహ్మ కడిగిన పాదము**<br>
**బ్రహ్మము తానె నీ పాదము**

**చెలఁగి వసుధ కొలిచిన నీ పాదము**<br>
**బలి తలమోపిన పాదము**<br>
**తలఁకక గగనము తన్నిన పాదము**<br>
**బలరిపు గాచిన పాదము.**

**కామిని పాపము కడిగిన పాదము**<br>
**పాము తల నిడిన పాదము**<br>
**ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము**<br>
**పామిడి తురగపు పాదము.**<br>
**పరమ యోగులకు పరిపరి విధముల**<br>
**పరమొసఁగెడి నీ పాదము**

తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము.

శ్రీనివాసుని దివ్యపాదాలు హృదయంలో నిలిచి పోయాయి. అవి బ్రహ్మదేవుడు ప్రతినిత్యం కడిగే పాదాలు, త్రివిక్రమావతార సందర్భంలో భూమిని ఆకాశాన్ని కొలచిన పాదాలు. బలిచక్రవర్తిని పాతాళానికి త్రొక్కిన పాదాలు.అహల్య పాపాన్ని కడిగిన పాదాలు. కాళింగుని పడగలను మర్దించిన పాదాలు. సంసార దుఃఖాన్ని పోగొట్టి శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదించే పాదాలు. ఈ తిరుమల కొండ స్థిరమైంది. "నేనే పరబ్రహ్మాన్ని" అని తెలిపే శ్రీ పాదాలు. ఆ పాటను మాటి మాటికి పాడుకోసాగాడు.



భావసముద్రంలో ఓలలాడుతున్న అన్నమాచార్యునికి వేంకటేశ్వరస్వామి సాక్షాత్కరించాడు. అన్నమాచార్యుడు ఆస్వామి పాదాల మీద వాలిపోయాడు. "ఆచార్య ! నీవు ధన్యుడవు. నీ నోట సంకీర్తన అవతరించింది.పల్లవి, చరణాలతో కూడిన ఈ కీర్తనకు ఒక స్థిరత్వం కల్పించు. నీవు పదకవితా పితామహుడవు. ఈ నాటి నుండి ఏమరక సంకీర్తనయజ్ఞం నిర్వహించు. రోజు కనీసం ఒక పాటైనా నీ నోట వినవలె.

నీ సంకీర్తనలు తప్ప మరెవ్వరివీ వినను. ఇది నా ప్రతిజ్ఞ. ఇదే నీ వ్రతం " అని వేంకటేశ్వరస్వామి ఆనతిచ్చి అదృశ్యమయ్యాడు. అన్నమాచార్యుడు స్వామి ఆదేశాన్ని పాటిస్తూ సంకీర్తన యజ్ఞం నిర్వహించేవాడు. ఊరూరు వాడవాడ తిరుగుతూ పాటలు పాడేవాడు. గుడిచేరి గుడిలో దేవుని కీర్తించి గుడిలో చేరే ప్రజలకు స్వామిమీద పాటలు పాడి వినిపించేవాడు. ఆ పాటలలోని, తేట తేట తెలుగు మాటలకు మురిసిపోయేవారు. ఆ మాటలలోని అర్థాన్ని గమనించి ఆనందించేవాళ్ళు.

అన్నమాచార్యుడు ఇలా సంచారం చేస్తూ శఠకోపయతులను గురించి విన్నాడు. శఠకోపయతి గొప్ప తపస్సంపన్నుడు. అహోబిలంలో వెలసిన నరసింహస్వామి యతి రూపంలో ప్రత్యక్షమై శఠకోపయతులకు సన్యాసాశ్రమం అనుగ్రహించారట. వారి శక్తియుక్తులను విన్న అన్నమాచార్యుడు యతిని దర్శించు కోవడానికి అహోబిలం వెళ్లాడు. దారిలో నందలూరు చొక్కనాథస్వామిని, ఒంటి మిట్ట రఘురాముని, కడప వేంకటేశ్వరుని దర్శించాడు. ఆ దేవుళ్ల మీద ఎన్నో పాటలు పాడాడు.

అహోబిల క్షేత్రం అహోబిలానికే అహోబలం అని కూడా పేరు. ఇది వైష్ణవులకు ప్రధాన క్షేత్రం. ఇక్కడే హిరణ్యకశిపుడు పరిపాలించాడు. కన్న కుమారుడైన ప్రహ్లాదుని హింసించాడు. భక్తుని రక్షించడానికి విష్ణువు నరసింహ స్వరూపంతో ఉగ్రస్తంభంలో ఆవిర్భవించాడు. భవనాశీ తీరంలో నరసింహస్వామి తొమ్మిది రూపాలతో వెలసి వున్నాడు. ఈ క్షేత్రం నల్లమల అడవులలో ఏర్పడింది. ఈ అడవి చిరుతపులులకు,సింహాలకు ప్రసిద్ధి. ఈ అడవులలో అన్నమాచార్యుడు నిర్భయంగ నడిచి వెళ్ళాడు. ఇక్కడ దిగువ అహోబలం, ఎగువ అహోబలం అని రెండు వున్నాయి. దిగువ అహోబలంలో ప్రహ్లాదవరదుడనే పేరుతో లక్ష్మీ నరసింహస్వామి వెలసి వున్నాడు. ఎగువ అహోబలంలో ఒక బిలంలో ఉగ్రరూపంతో స్వామి హిరణ్యకశిపుని పొట్ట చీలుస్తూ ఆవిర్భవించి ఉన్నాడు. అన్నమాచార్యుడు

ఆ దివ్యమూర్తులను కీర్తించాడు.

భవనాశినీ నది ఒడ్డు మీద ఒక మండపంలో అపర నరసింహస్వామివలె శఠకోప యతులు కూర్చున్నారు. అన్నమాచార్యుడు శఠకోప యతుల పాదాలపై వాలాడు ; ఆనందంతో ఆవేశంతో ఆ యతిని స్తుతించాడు. అతని వద్ద సుమారు పండ్రెండేండ్లు శుశ్రూష చేశాడు. వైష్ణవ ఆగమాలన్నీ నేర్చుకున్నాడు. విష్ణు తత్త్వాన్నిలా అర్థం చేసుకున్నాడు- " విష్ణువు దయామయుడు. సకల ప్రాణులు విష్ణువుని చేరడానికి అర్హులు. జాతితో కాని మతంతో కాని, వర్ణంతో కాని , వర్గంతో కాని పనిలేదు: శరణాగతి మంత్రం పఠిస్తే చాలు. భగవంతుడు వశుడౌతాడు." శఠకోప యతి బోధనలు అన్నమాచార్యుని ఆకట్టుకొన్నవి. ఆ ప్రబోధాన్ని వినిపించడానికే అన్నమాచార్యుడు సిద్ధమయ్యాడు; అందరికీ విశద పరచాడు.



తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనాన

బ్రహ్మ మొకటె పర-బ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటె పర బ్రహ్మ మొకటే.

కందువగు హీనాధికము లిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ.

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే
చండాలు డుండేటి సరిభూమి యొకటే.

కడఁగి యేనుఁగు మీఁద కాయు యెండొకటే
పుడమి శునకము మీఁద - పొలయు నెండొకటే
కడు పుణ్యులను బాప కర్మలను సరిగావ
జడియు శ్రీ వేంకటేశ్వరు నామ మొకటే.

అన్నమాచార్యుని సంస్కారం గొప్పది. తనకు దొరికిన గురువు, దైవము ఇరువురూ భక్తసులభులే. మానవజాతి కల్యాణం కోసం వైష్ణవ తత్త్వాన్ని అన్నమాచార్యుడు కమ్మని పాటల ద్వారా ప్రచారం చేయసాగాడు. అన్నమాచార్యుని సంకీర్తనలు దేశవ్యాప్తం అయ్యాయి.

సాళ్వనరసింగరాయలు తాళ్లపాకకు సమీపంలో ఉన్న టంగుటూరులో దండనాథుడుగా ఉండేవాడు; మహావీరుడు. అతని పేరు నరసింగరాయలు. "సాళ్వ" అనేది బిరుదం. తర్వాత తర్వాత ఇది ఇంటి పేరుగా స్థిరపడింది.


సాళ్వనరసింగరాయులు అన్నమాచార్యుని తన గురువుగా భావించాడు. అన్నమాచార్యుని అనుమతి లేకుండ నరసింగరాయలు ఏ పనీ చేసేవాడు కాదు. అన్నమాచార్యుని ఆశీర్వాదబలం వల్ల తన పరాక్రమం వల్ల నరసింగరాయులు పెనుగొండ రాజ్యానికి ప్రభువయ్యాడు. అన్నమాచార్యుని పెనుగొండ సీమకు ఆహ్వానించి గొప్ప సన్మానం చేసి తనకు తోడు నీడగ అక్కడే ఉండమని ప్రార్థించాడు. తన భగవత్సంకీర్తనకు ఆటంకం కానంతవరకు అక్కడే ఉంటానన్నాడు. రాజు అన్నమాచార్యునికి సకల సదుపాయాలను సమకూర్చాడు. వైష్ణవ ధర్మవ్యాప్తికి రాజాశ్రయం ఉపకరిస్తుందనే ఆచార్యుడు అంగీకరించాడు. దేవాలయాలను కేంద్రాలుగా చేసుకొని సంకీర్తనల ద్వారా విశిష్టాద్వైత మత వ్యాప్తి చేయసాగాడు.

ఒక నాడు, రాజు, అన్నమాచార్యుని తన కొలువుకూటానికి ఆహ్వానించాడు. మంత్రులు, సామంతులు, దండనాథులు, అంతఃపుర స్త్రీలు సభలో ఉన్నారు. రాయలు అన్నమాచార్యుని ఒక మధురమైన సంకీర్తన వినిపించమని ప్రార్థించాడు. ఆచార్యుడు ఒక శృంగార పదాన్ని పాడాడు.

**ఏమొకో చిగురుటధరమున యెడనెడ కస్తూరి నిండెను**
**భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా**
**కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపై తోఁచిన**
**చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు**
**నలువున ప్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపులు**
**నిలువున పెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా.**

ఆ పాట విని రాజూ, సభలోనివారు పరవశించారు. రాజు అన్నమాచార్యుని ఘనంగా సత్కరించాడు. రాజు లోభంతో "ఇటువంటి పాట నా మీద కూడ ఒకటి పాడవే" అని అన్నమాచార్యుని కోరాడు. ఆ హరిభక్తుడు చెవులు రెండు గట్టిగ మూసుకున్నాడు. ఆసనం నుండి దిగ్గున లేచి " రాజా ! ఎంత నీచమైన మాట అన్నావు. హరిని గురించి పొగడే ఈ

నాలుకతో ఇతరులను ఎలా స్తుతించేది ? నీకు, నీ కొలువుకు నమస్కారమని సభనుండి నిష్క్రమించాడు. నలుగురి యెదుట అన్నమాచార్యుడు తిరస్కరించడం రాజుకు తల కొట్టి వేసినంత పనైంది. వెంటనే భటులను పిలిపించి అన్నమాచార్యుని బంధించి తెప్పించాడు. అతని కాళ్లకు మూరురాయరగండ సంకెల బిగించాడు. చెరసాలలో త్రోయించాడు. అన్నమాచార్యుడు వేంకటేశ్వరుని గురించి దీనాతి దీనంగా ఒక పాట పాడాడు.



నీ దాసుల భంగములు నీవు చూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా

పాలసముద్రము మీఁద పవళించినట్టి నీకు
బేలలై సురలు మొరవెట్టినయట్టు
వేళతో మా మనవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాద

ద్వారకా నగరములో తగనెత్తమాడే నీకు

బీరాన ద్రౌపది మొరవెట్టినయట్టు
ఘోరపు రాజసభల కుంది విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నిఁక రక్షించరాదా.

యెనసి వైకుంఠములో నిందిర కూడుకున్న నీకు
పెనఁగి గజము మొరవెట్టినయట్టు
చనవుతో మా కొరకె సారె విన్నవించితిమి
విని శ్రీవేంకటేశుఁడ వేగ రక్షించరాదా.

అన్నమయ్య పాట ముగిసినది. సంకెళ్ళు తెగి నేల పడ్డాయి. భటులు ఆశ్చర్యపడి ఈ విషయం రాజుకు తెలిపారు.

రాజు ఆచార్యుని వద్దకు వచ్చి " నేను నమ్మను. ఈసారి సంకెళ్ళు బాగా బిగించండి "అని భటులను హెచ్చరించి " ఏమయ్యా అన్నమయ్యా ! ఏదీ, ఈ సారి పాడి సంకెళ్లు తెంచుకో చూద్దాం " అని ఎకసెక్కెం చేశాడు. ఆ మహాభక్తుడు రాజు అజ్ఞానానికి నవ్వు కొని వేంకటపతిమీద పాట పాడాడు.

" ఆకటి వేళల అలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కు మరి లేదు "

రాజు కళ్ల ఎదుటే సంకెళ్ళు తెగి నేలమీద పడ్డాయి . రాజు వెంటనే తన తప్పు తెలుసు కొని ఆచార్యుని పాదాల మీద పడి క్షమించమని ప్రార్థించాడు. అన్నమాచార్యుడు రాజుని క్షమించాడు. " రాజా! ఎప్పుడూ హరి భక్తులను బాధ పెట్టవద్దు. భాగవతావమానం భగవదవమానానికి మించింది. కలియుగంలో భగవంతుడు సంకీర్తనంతోనే తృప్తిపడేది. రాజు విష్ణువుతో సమానం. నీవు ధర్మ రక్షణ సాగించు" అని బోధించి అన్నమాచార్యుడు "రాజాశ్రయం తమవంటి వారికి మంచిది కాద"ని తిరుమల క్షేత్రానికి తరలి వెళ్ళాడు.

15వ శతాబ్దంలో మతరాజకీయ కల్లోలాలతో ఆంధ్రదేశం సతమతమయ్యేది. మహమ్మదీయులు దేవాలయాలను ధ్వంసం చేశారు. గోవులను చంపారు.స్త్రీలను మానభంగం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్నమాచార్యుడు తిరుపతి యాత్ర సాగిస్తున్నాడు. ఒక రోజు దారిలో ఆంజనేయస్వామి గుడిలో విశ్రమించాడు. ఇంతలో కొందరు తురక సైనికులు గుర్రాలమీద వచ్చి ఆ గుడిని కూల్చారు. అక్కడున్న వాళ్లను బెదిరించి వాళ్ల మూట ముల్లె దోచుకొని వెళ్ళారు. అన్నమాచార్యునికి అంతుపట్టలేదు. తనవద్ద ఉన్న ఆస్తి వేంకటేశ్వరస్వామి పూజా విగ్రహం. దానిని కూడా దక్కించుకోలేక పోయాడు. ఎదురుగా నిలువెత్తు హనుమంతుల వారి విగ్రహం. కూలి పోయిన గుడిగోడలు, తనవలెనె నిరాశ్రయులైన మనుష్యులు. అన్నమాచార్యునికి దుఃఖం వెల్లుబికింది. దీనాతి దీనంగా ఒక గీతం ఆలపించాడు.

ఇందిరా రమణు తెచ్చి యియ్యరో మాకిటువలె
పొంది యీతని పూజింప పొద్దాయ నిపుడు

ధారుణి మైరావణు దండించి రాము తెచ్చి
నేరుపు మించిన ఆంజనీతనయా !
ఘోర నాగపాశముల కొట్టి వేసి యీతని
కారుణ్య మందినట్టి ఖగరాజ గరుడా !
శ్రీ వల్లభునకు నశేషకైంకర్యములా
శ్రీ వేంకటాద్రివైన శేష మూరితి
కైవసమైనయట్టి కార్త వీర్యార్జునుడా యీ
దేవుని నీ వేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే

అలా పాడి పాడి అలసి పడిపోయాడు.ఇలా సామ్మంతా కొల్ల గొట్టుకొని తురక సైనికులు తమ గుడారాలలో చేరి కేరింతలు కొడుతున్నారు. ఇంతలో వాళ్ల మధ్య ఒక కోతి ప్రవేశించింది. వాళ్ళు చూస్తూండగానే

గుడారమెత్తు పెరిగింది. అన్నమాచార్యుని పూజావిగ్రహాలున్న సంచిని తీసికొని గుడారాన్ని నేలమట్టం చేసింది.

అన్నమాచార్యుని ఎవరో తట్టి లేపినట్లైంది. కళ్ళు తెరచి చూస్తే ఎదుట పూజా విగ్రహాలు కనిపించాయి. సంతోషంతో ఉక్కిరి బిక్కిరయ్యాడు. "స్వామీ ! ఇదంతా నీ చలువే" అని వేంకటేశ్వరస్వామిని స్తుతించాడు.



అన్నమాచార్యుడు తిరుమల క్షేత్రం చేరుకున్నాడు. తన జీవితమంతా ఆ స్వామి సన్నిధిలోనే గడపసాగాడు. స్వామి ఉత్సవాలలో ఊరేగింపులలో పాల్గొనేవాడు. ఎన్నోపాటలు పాడేవాడు. సుప్రభాతసేవ మొదలుకొని ఏకాంతసేవ దాకా స్వామికి సంకీర్తనలు పాడి వినిపించేవాడు. "శృంగారమంజరి" అనే ద్విపద కావ్యం వ్రాశాడు. మధుర భక్తిని తెలిపే శృంగార సంకీర్తనలు వినిపించాడు. ఆ పాటలు శ్రీనివాసుడు ప్రత్యక్షంగా వినేవాడట.

ఒక నాడు అన్నమాచర్యుడు పాడిన శృంగారపదం విని స్వామి ఇలా అన్నాడు. "అన్నా ! తేనెలూరే నీ శృంగార పదాలు వింటూంటే నాలో కొత్త యవ్వనం వస్తూంది. ఇంతకు ముందున్న విరక్తిలేదు" అన్నమాచార్యునికి

స్వామితో ఏమిబదులు చెప్పాలో తోచలేదు. తడబడుతూ తడబడుతూ మెల్లగా అంటున్నాడు "స్వామీ ! మిమ్ము వేదాలు వినుతించాయి. నిత్యం జ్ఞానులు స్తుతిస్తున్నారు. దేవత లందరూ మీ కీర్తిని గానం చేస్తున్నారు.....నేనెంత...తోలు బొమ్మను....నన్ను పాలుపోసి పెంచిన తండ్రి నీవు. నా నాలుక మీది పాటలు నీవే వినిపిస్తున్నావు..... నీవు మాధవునివి....నేను నీదాసుడిని...." ఆచార్యుని పాటలు వింటూ శ్రీనివాసుడు చిరునవ్వులు చిందించాడు.

అన్నమాచార్యుడు మహాభక్తుడు. అతని నోటి వెంట వచ్చిన మాట అక్షరాల జరిగి తీరుతుంది. నిర్మలమైన మనస్సు. లోకకల్యాణ దృష్టి. సంకీర్త యజ్ఞం తపస్సు, ఇంక ఆ మహాపురుషునికి సాటి ఎవ్వరు ? ఒకరోజు స్వామికి నైవేద్యంగా మామిడి పళ్లను సమర్పించాడు. పెరుమాళ్లకు ఆరగింపైన పళ్లను నోట పెట్టుకుంటే పుల్లగా వున్నాయి. ఆ భక్తునికి చెప్పరాని బాధ కలిగింది. "అయ్యో ! నా స్వామికి పులుపు పళ్ళు నైవేద్యం పెట్టానే ... ఎంత అపచారం జరిగింది. "అని ఆ మామిడి చెట్టును తాకి "దీని పళ్ళు పంచదార పళ్లు అగుగాక "అని వేంకటపతిని ప్రార్థించాడు. ఆ జీడిమామిడి పళ్ళు తియ్యమామిడి పళ్లయ్యాయి. ఇలా అన్నమాచార్యుని మహిమలు లోకమంతా ప్రాకిపోయాయి.

ఒక పేద బ్రాహ్మణుడు అన్నమాచార్యుని దర్శించి తన వివాహానికి ధన సాహాయ్యం అనుగ్రహించమన్నాడు. అన్నమాచార్యుని ఆశీర్వాదం వల్ల ఒక రాజు ఆ బ్రాహ్మణుని పిలిచి పెళ్ళి చేయించి ధన కనక వస్తువాహనాలు సమర్పించాడు. అన్నమాచార్యుని పాటలు వింటే చాలు బలమైన రోగాలు నయమౌతాయి. భూతభేతాళపిశాచాలు పారిపోయేవి. అవి పాటలు కావు. వేంకటేశ్వరస్వామి దివ్య మంత్రాలు.



అన్నమయ్య మహిమలను, సంకీర్తనలను విని పురందరదాసు తిరుమలకు వచ్చాడు. పురందరదాసు కన్నడ దేశానికి చెందిన భక్తకవి. మహాగాయకుడు. అతనికి కర్ణాటకసంగీతపితామహుడనే బిరుదం వుంది. పురందరదాసు అన్నమాచార్యులను కలుసుకోవడానికి వెళ్ళాడు. అన్నమాచార్యులు మూర్తీభవించిన వేంకటేశ్వరునిలా కూర్చొని, ఒక చేత్తో తంబుర మీటు కుంటూ మరొక చేత్తో భావాన్ని విప్పి చెప్తూ పాట పాడుతున్నాడు. భక్తులందరు పారవశ్యంతో పలుకుతున్నారు.

**శరణు శరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతి వల్లభా**
**శరణు రాక్షసగర్వసంహార శరణు వేంకటనాయకా.**

**కమలధరుడును కమల మిత్రుడు కమలశత్రుడు పుత్రుడు**
**క్రమముతో మీ కొలువుకిప్పుడు కాచినా రెచ్చరికయా.**

**అనిమిషేంద్రులు మునులు దిక్పతులమరకిన్నర సిద్ధులు**
**ఘనతతో రంభాది కాంతలు కాచినా రెచ్చరికయా.**

**ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు నిన్ను కొలువఁగ వచ్చిరీ**
**విన్నపము వినవయ్య తిరుపతి వేంకటాచలనాయకా**

పురందరదాసు ఆ సన్నివేశం చూస్తూ మైమరచి పోయాడు. అ ప్రయత్నంగ అదే ధోరణిలో ఒక పాట పాడాడు.

శరణు శరణు సురేంద్రవందిత శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతి తనయ మారుతి శరణు సిద్ధివినాయక

నిటలనేత్రన దేవిసుతనె నాగభూషణ ప్రియనె
తటిల్లతాంకిత కోమలాంగనె కర్ణకుండలధారనె

బటువుముత్తిన పదక హారనె బాహుహస్త చతుష్కనె
ఇట్టి తొడగియు హేమకంకణ పాశ అంకుశ ధారనె

కుక్షియొళు మహాలంబోదరనె ఇక్షుచాపగెలిదనె
పక్షివాహన నాద పురందర విఠ్ఠల నిజదాసనె

అన్నమాచార్యులు, పాటపాడే యువకుణ్ణి చూసి, ఆనందంతో దగ్గరకు రమ్మని కళ్లతోనే పిలిచాడు. పురందరుడు - "స్వామీ ! మీ మహిమలను విన్నాను. మీ సంకీర్తనలనూ విన్నాను. అవి పాటలు కావు. నాపాలిటి పరమ మంత్రాలు. నా జన్మ తరించింది. మీరు సామాన్యులు కారు. సాక్షాత్తు వేంకటేశ్వరుని అపరావతారమ"ని స్తుతించాడు. అన్నమాచార్యుడు అప్పటికే బాగా వృద్ధుడయ్యాడు. దాసులవారిని కౌగలించుకొని ...... "నీవు సామాన్యుడవా ! రంగ విఠ్ఠలుని అనుగ్రహానికి పాత్రుడైనవాడివి. నీవు సంధ్య వార్చుకోవడానికి ఆ స్వామితోనే నీళ్లు తెప్పించుకొన్న భాగ్యశాలివి. నీ పాటలు కర్ణాటక సంగీతానికి తొలి పాఠాలవుతాయ"ని ఆశీర్వదించాడు.

అన్నమాచార్యుని రచనలెన్నో కాలగర్భంలో కలసి పోయాయి. వీరి రచనలను రాగిరేకులమీద కూడా వ్రాయించారు. అవన్నీ తిరుమల దేవాలయంలో సంకీర్తన భండారంలో భద్రపరచారు. కాని మన తెలుగు వాళ్ల అశ్రద్ధ, అవివేకం, పేరాశల వల్ల అలాంటి రేకులు కొన్ని వేలు పోగొట్టుకొన్నాం. రాగం విలువ తెలియని జాతి కోసం రాగి కోసం వానిని కరగించుకొన్నది. అన్నమాచార్యులు 32,000 సంకీర్తనలు వ్రాస్తే మనకు 12,000 మాత్రమే

దొరికాయి. పండ్రెండు శతకాలు రచిస్తే ఒక శతకము మాత్రం దొరికింది. ఇంకా వారు వ్రాసిన ద్విపద రామాయణం, వేంకటాచల మహాత్మ్యం సంకీర్తన లక్షణం, ఎన్నో భాషల్లో వ్రాసిన ప్రబంధాలు మనం పోగొట్టుకొన్నాం.

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలయ్య, మనుమడు చిన తిరుమలయ్య చిన్నన్న మొదలైనవాళ్లు కూడా మహా కవులు, గాయకులు. వీళ్లందరినీ తాళ్లపాక కవులని వ్యవహరిస్తారు. ఈ తాళ్లపాక కవులు తెలుగు భాషకు చేసిన సేవ చాల గొప్పది. సంకీర్తనలు, ద్విపదలు, ఉదాహరణలు, దండకాలు, శతకాలు, వ్యాఖ్యానాలు, లక్షణగ్రంథాలు,రగడలు, మొదలైన ప్రక్రియల్లో రచనలు చేశారు. అన్నమాచార్యుల పెద్దభార్య తిమ్మక్క తెలుగులో తొలి కవయిత్రి ఈమె కుమారుడు నరసింగన్న మహాకవి. ఈ తాళ్లపాక కవులు కేవలం కావ్యాలు వ్రాయడమే కాదు, ఎన్నో దేవాలయాలు నిర్మించారు. పడిపోయిన గుళ్లను మరమ్మత్తు చేయించారు. వైష్ణవ దేవాలయాల్లో సంకీర్తనలు పాడే ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఉత్సవాలను ఊరేగింపులను ప్రవేశపెట్టారు. తిరుమల దేవాలయానికి ఎన్నో కైంకర్యాలు చేశారు. మండపాలు నిర్మించారు. స్వామి పుష్కరిణికి మెట్లు కట్టించారు. కల్యాణోత్సవం ప్రవేశపెట్టారు. బ్రహోత్సవాలను నిర్వహించారు. వీరు చేసిన సేవలను తెలిపే శాసనాలు సుమారు అర్వై దాకా తిరుమల తిరుమతి దేవస్థానాలలో శిలాక్షరాలుగ నిలిచి ఉన్నాయి.

అన్నమాచార్యులు క్రీ.శ.1503లో నిర్యాణం చెందారు; అది దుందుభి సంవత్సరం (ఫాల్గుణ ) బహుళ ద్వాదశి. అన్నమాచార్యుడు బాగా వృద్ధుడయ్యాడు. అప్పటికి అతని వయస్సు 95 ఏండ్లు. మెల్లగ పెద తిరుమలయ్యను దగ్గరకు పిలిచాడు. రహస్యంగా ఇలా అన్నాడు.- " తిమ్మప్పా ! నేటితో నా సంకీర్తన యజ్ఞం సమాప్తమౌతుంది. ఇంక దినానికి ఒక్క సంకీర్తన తక్కువ కాకుండా శ్రీనివాసునికి అర్పించే బాధ్యత నీది. ఈ యజ్ఞం నీవే కొనసాగించవయ్యా "..... అన్నమాచార్యుడు పెద తిరుమలయ్య

చేతికి తంబుర, చిరుతలు అందించాడు. తిరుమలయ్య కళ్లలో నీళ్లు నిండాయి. అన్నమాచార్యుడు కుమారుని తల నిమురుతూ ఏదో అస్పష్టంగ పలికాడు..... అది వేంకటేశ మంత్రం కాబోలు ! గంభీరంగా అడుగులు వేసుకుంటూ ఆ కారణజన్ముడు తిరుమల మందిరంలో కలసిపోయాడు...... ఏదో ఒక తేజస్సు తండ్రి శరీరం నుండి వెలువడి వేంకటేశ్వరునిలో లీనం కావడం పెదతిరుమలయ్య మనో నేత్రాలకు గోచరించింది....

ప్రతి బహుళ ద్వాదశినాడు పెదతిరుమలయ్య ఇలా పాడుకుంటూ ఉండేవాడు...

దినము ద్వాదశి నేఁడు తీర్థ దివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే

అనంత గరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుగొని యారగించ విచ్చేయవే

వైకుంఠాన నుండి యాళువారల లోపల నుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంత తోడ నున్న శ్రీవేంకటేశుఁగూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే

సంకీర్తనము తోడ సనకాదు లెల్ల పాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమినుండి
లంకె శ్రీ వెంకటగిరి లక్ష్మివిభుడ నీవు
నంకెల మా యింటి విందు లారగించవే

చినతిరుమలయ్య తాతగారికి తిరువారాధన నిర్వహిస్తూ ఉండేవాడు.

# తాళ్లపాక అన్నమయ్య పాటలు

ముఖారిరాగం - ఆదితాళం

బ్రహ్మ గడిగిన - పాదము ! బ్రహ్మము తానె నీ - పాదము ||పల్లవి||

1. చెలఁగి వసుధఁ-గొలిచిన దీ పాదము | బలితల మోపిన - పాదము |
తలఁకక గగనము-తన్నిన పాదము |బలరిపుఁ గాచిన - పాదము ||బ్రహ్మ||

2. కామిని పాపము - కడిగిన పాదము | పాముతల నిడిన పాదము |
ప్రేమపుశ్రీసతి - పిసికెడి పాదము | పామిడితురగపు - పాదము | ||బ్రహ్మ||

3. పరమయోగులకు - పరిపరివిధముల | పర మొసగెడి నీ - పాదము |
తిరువేంకటగిరి- తిరమని చూపిన | పరమపదము నీ - పాదము | ||బ్రహ్మ||

లఘుటీక :

(ప) బ్రహ్మ కడిగిన = దినమును రాత్రివేళ బ్రహ్మ వచ్చి శ్రీనివాసుని నారాధించు నని యైతిహ్యము.

1. చెలఁగి....=త్రివిక్రమావతారకథ యిచట అనుసంధింప వలసినది. తలఁకక = సంకోచింపక. బలరిపు = ఇంద్రుని.

2. కామిని = ఇంద్రుని కామనకు లోబడిన అహల్య. పాముతలనిడిన= కృష్ణావతారమున కాళియుని పడగలపైఁ బెట్టి నటించిన, పామిడి = ప్రామిడి - క్రూరుఁడని శబ్దరత్నాకర మిచ్చిన యర్థము.గయ్యాళి,ధూర్తుఁడు అనునర్థములనువే.ప్రభాకర శాస్త్రిగారిచ్చిరి. ( చూ. బసవపురాణ పీఠిక. 120 ) ఇక్కడ ధూర్తు లేక ఉద్దండము అను నర్థమే యుచితము. వ్యుత్పత్తి విచారింపఁదగును. కల్కియవతారము అభిసంహితము.

( తా.పా..పు. 21 ) (రా.అ.కృ.శర్మ)

(ప) బ్రహ్మ కడిగిన పాదము = త్రివిక్రమావతారసందర్భమున స్వామిపాదము సత్యలోకమును తాకినది. బ్రహ్మ దానిని తన తండ్రిపాదముగ గుర్తించి కమండలూదకములతో కడిగి పూజించినట్లు భాగవతమున కలదు.

( పోతన, భాగ, అష్టమస్కం.ప.63)

2. కామిని.... పాదము: అహల్యాశాపవిమోచన వృత్తాంతమును అనుసంధింపవలెను. ఇంద్రుని కామనకు లోబడిన తన భార్య అహల్యను చూచి గౌతముడు అసహ్యించుకొనెను. నీవు ఆహారపానవిహీనవై వాయుభక్షణవై ఇక్కడనే బూడిదలో పడి ఉండుము. అదృశ్యాకారముతో అంతులేని తాపముతో పొరలుచుండుము అని ఆ జారిణిని శపించెను. దశరథరాముని దర్శనముతో నీవు పవిత్రత్వమును పొందుదు వని ముని అనుగ్రహించి వెడలెను. యాగ సంరక్షణార్థము విశ్వామిత్రుని వెంట వెళ్లిన రామలక్ష్మణులు గౌతముని ఆశ్రమమును ప్రవేశించినారు. కామిని పాపమును శ్రీరాముని పాదరజము క్షాళనము చేసెను.

( కా. శ్రీ)

**పామిడి....పాదము :**

పాము+ఇ : పాములను ఇ అభావద్యోతక ప్రత్యయము, లేకుండా చేసేది. గరుత్మంతుడని, తురగ శబ్దము వాహనమని సామాన్యార్థము. గరుత్మంతుని వాహనంగ చేసుకొన్న దివ్యపాదమని ఇంకను ఈ శబ్దము విచార్యము.పరమపదమైన శ్రీనివాసుని శ్రీ పాదమును బహుధా ఉల్లేఖించు పాట ఇది.పరబ్రహ్మ స్వరూపుడైన వేంకటేశ్వరుని పాదము బ్రహ్మ దేవుడు అర్చించినది. వామనావతారమున బలిచక్రవర్తిని మూడడుగుల దాన మడిగినాడు; త్రివిక్రముడై ఒక అడుగుతో భూమిని, మరొక అడుగుతో గగనమును ఆక్రమించినాడు. మూడవ అడుగు బలి తలమీద మోపి పాతాళమునకు త్రొక్కినాడు. ఇంద్రునకు

స్వర్గమునను(గహించినాడు. కావుననే విష్ణుపాదము వసుధను కొలిచినది; గగనమును తన్నినది; బలితల మోపినది; ఇంద్రుని గాచినది. ఇది అహల్య పాపమును కడిగిన పాదము; కాళియుని మర్దించిన పాదము. ఆదిలక్ష్మి ప్రేమంతో ఒత్తే పాదము. ( జగద్రక్షణవ్యాపారమున తన భర్త అలసినా డని కాబోలు !!). కల్కి పురుషుడై ఉద్దండమైన తురగముపై నిలిపిన పాదము. తిరువేంకటగిరి స్థిరమని చూపిన పాదము. పరమ యోగులకు పర మొసగెడునది ఈ పాదము.

అనాది నుండి అందరూ సేవించిన స్వామి పాదమును కొలిచి తరించు డనియే అన్నమయ్య బోధన. ఇదియే శాశ్వత పదమని అతని విశ్వాసము. పదకవితా పితామహుడు పదపాదమున శ్రీనివాసుని దివ్యపాదమును నిలిపినాడు.

( కా. శ్రీ)



రా. అ.కృ. శర్మ : రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ
కా.శ్రీ. : కామిశెట్టి శ్రీనివాసులు

## Tallapaka Annamacharya - Sahitya Bhava

मुंगिट नल्लदिवो मूलनुन्न धनमु बंगारु शिखराल बहुब्रह्ममयमु
अदिवो अल्लदिवो हरिवासमु पदिवेल शेषुल पडगल मयमु ।

This song of Annamacharya takes us to spiritual heights of Venkatachalam and gives us darsan of Tiruvengadamudayan who captivates us with His everlasting smile 'Chidvilasa'. The self-mainfested idol on the banks of Swamy Pushkarini shows His 'Varada Hasta' and which echos 'Deergha Saranagati' - the easy path for solvation. This shrine is mentioned in Rigveda, Tolkappiyam, Silappadikaram and other ancient texts. This God is worshipped by saints, seers, kings, intellectuals and devotees from times immemorial. The Alwars of South India have offered flowers of pasurams to His Holy Feet. Tallapaka Annamacharya, the mystic saint-poet of 15th century, who has designed his life on the foot-steps of Alwars composed thousands of songs in praise of this KALIYUGA PRATYAKSHA DAIVAM. What Krishna was to Meera Venkateswara was to Annamacharya. Just as Jayadeva propounded RADHAMADHAVA TATTVA through his ASHTAPADIS Annamacharya portrays Alamelmanga Srinivasa Tattva in his Sankirtanams. He sang with pristine purity of Surdas and preached with courage and conviction of Kabirdas. This wandering minstrel of Venkateswara belived in monotheism. His God the only God being Venkatachalpati. This gifted Vaggeyakara started his prolific composing after the momentary vision he had of the Lord, which inspired his songs and sharpened his perception of the Ultimate Reality, We get a glimse of his creative genius and towering personality from his works, almost a reflection of his mind and the period he lived in. To quote my guru Sri Rallapalle

Anantakrishna Sama"... in them Annamayya prays and praises the Lord, makes love to Him passionately in a hundred ways, converses, argues and even quarrels with Him, once in a while jests with Him too, then meditates on His many paradoxical attributes, confesses his countless failures and apprehensions, sues for His grace and finally surenders himself to Him as the first and last refuge".

Annamacharya was acclaimed by his contemporaries as PADAKAVITA PITAMAHA, SANKIRTANACHARYA and DRAVIDAGAMA SARVABHOUMA. He made remarkable contrbution to Telugu Literature and the later poets were greatly influenced by his imagery, expression, idiom and native vocabulary. He is said to have composed 32,000 songs both in Adhyatma and Sringara aspects. He wrote Sringara Manjari (Manjari dwipada), twelve Satakams, Sankirtana Lakshanam (in Sanskrit), and Venkatachalamahatmyam. All his works were engraved on thick copperplates under the direct supervision of his son Peda Tirumalacharya and his grandson China Tirumalacharya (both of them were also great composers. Annamacharya, Peda Tirumalacharya and China Tirumalacharya are called as Tallapaka trinity). This rich legacy had been lying hidden for some centuries in Sankirtana Bhandaram, located in Srivari Temple. The greedy have melted thousands of these copperplates caring for the cooper ignoring the value of compositions. At present we have only 12,000 compositions, Sringara Manjari, one Satakam and the rest of Annamacharya's works are irrevocably lost.

In Telugu Literature only Annamacharya's compositions were the earliest. Prior to Annamacharya there were songs. Nannechoda in his Kumarasambhavam refers to the folk songs sung by SABARA WOMEN. Palkuriki Somanatha

describes varieties of padams (songs) sung by the devotees while climbing up Srisaila hills. Not even a single song is recorded and retained by posterity. Krishnamacharya's Simhagiri Narahari Vachanams were also earlier to Annamacharya but they were only blank verses. Annamacharya carefully systematised the song by adopting desi metres and shelving orthodoxical exigencies. During the same century the songs composed by Karnataka Haridasas Narahari Teertha, Sripadaraya and Vysaraya were quite popular. Purandaradasa was an younger contemporary to Annamacharya and according tro Chinnanna's biography Annamacharya Charitra, both the Saint-Composers meat at Tirumala. Annamacharya has evolved a song of his own with absolute unity of RAGA - BHAVA-TALA. The scope and structure of his song, he has discussed elaborately in his Sankirtana Lakshanam. His song contains PALLAVI and CHARANAMS. The pallavi contains the central idea of the song. If the given idea is not completed in one sentence it is extended to another sentence which goes by the name Anupallavi. The explanation and elaboration of the idea continue in the charanams. The last charanam invariably contains the MUDRA (callophone of the author). The raga and talam will be uniform from beginning to the end. Quite contrary to this a particular form called SULADI emerged in Kannada Literature during 15th and 16th centuries wherein each charanam will have a different tala. We have only one of its type in Annamacharya which goes by the name DESI-SULADI. The pecularity of this form is it is RAGA TALA MALIKA.

Annamacharya's compositions are basically classified into two categories SRINGARA and ADHYATMA.

The former deals with MADHURA BHAKTI and the later dwells in DEERGHA SARANAGATI. His Sringara Sankirtanas express unusual spiritual beauties. Even in ADHIBHOUTIKA plane he evokes ADHYATMIKA spirit and his Sringara padams are built on the strength of a well-known saying "PUMAN VISHNU RITI KHYATO STRIPRAYAM ITARAM JAGAT". His devotion or love for God is in no way different from that of Gopikas to Lord Krishna, which was platonic love. This is the love of soul for soul, a love in which sensual desire has no place. In his un-adulterated thoughts of Sringara (AMALINA SRINGARAM) We can notice Viswa Sringara Nayikas swimming relent-lessly in the curreents of Madhurabhakti craving for the per-manent embrace of Parama Purusha SAYUJYA. His Adhyatma Sankirtanas reveal the fragrance of Visishtadvaita. Annamacharya a perfect man, in whom bhakti and prapatti are highly embedded. He was a direct disciple of Adi-Van-Sathakopa yati of AHOBIL MATH. He was greatly inspired by the life and philosophy of Ramanuja. He advocates a society - breaking the barriers of class, caste and creed. His TANDANA PADAM reverberates the UPANISHAD Vakya "SARVAM KHALVIDAM BRAMHA" and the message of Bhagavadgita in "*Vidya Vinaya Sampanne Bramhane Gavi Hastini Sunichaiva Svapakecha Panditassamadarsinaha*" Annamacharya elaborates this idea, "Brahmam is supreme. The entire creation is one and the same. God is all-pervading. The slumber of the king and the servant is one. The Brahmine and Chandala are walking on the same ground. The Sun shines alike on the elephant and the dog. Lord Venkateswara does not make any discrimination. He dwells in every soul.

1. This desi-Suladi (A rare composition) is presented at the Annual conference of the madras Musci Academy on December, 28, 1978.

तंदनान आहि तंदनान पुरे तंदनान भला तंदनान
ब्रह्ममोकटे परब्रह्ममोकटे ब्रह्ममोकटे परब्रह्ममोकटे

कंदुवगु हीनाधिकमुलिंदुलेवु अंदरिकि श्रीहरे अंतरात्म
इंदुलो जन्तुकुलमिंतानोकटे अंदरिकि श्रीहरे अन्तरात्म

निंडार राजु निद्रिंचु निद्रयुनोकटे अंडने बंटुनिद्रअदियु नोकटे
मेंडैन ब्राह्मणुडु मेट्टुभूमियोकटे चंडालुडुंडेटि सरि भूमि योकटे

कडगि येनुगुमीद कायु येंडोकटे पुडमि शुनकमु मीद पोलयु नेंडोकटे
कडु पुण्युलनु पापकर्मुलनु सरिगाव जडियु श्रीबेंकटेश्वरु नाम मोकटे

Annamacharya was free, frank and outspoken. He was not a hypocrite. "What do I care for these temporal riches. I always look to the service of Lord Venkateswara". He cared more for his own experiences rather than others. He gave expression both to his inward and outward feelings. He lead, a life of straightforwardness (ARJAVAM). This quality is shaped in his song which is simple, sweet and sharp. This independent spirit and absolute commitment to Almighty made him to say 'NO' to a powerful Vijayanagara King Saluva Narasingaraya when he wanted him to compose a song in praise of him. "This tongue is used to praise NARAHARI but not NARA" he declared. He rather submitted to king's fretters of wrath and he could break the royal chains with a song and made the mighty king to surrender.

The song that tempted the king is full of literary beauties. The Nayika (Alamelmanga) came out of the nuptial bedroom and was caught by mischievous Sakhis. They started teasing her -

See how kasturi is sprinkled on her tender lips ! Don't you think it is the love-letter written by her to her husband. See how reddish her eyes are ! Don't you know the reason, she has fixed her glances on the bozom of her husband thinking that he is not looking at her. When she noticed that her husband is seeing, instantaneously she withdrew her glances and the reddishness of the eyes is due to the touch of blood. (The glances are compared to arrows.)

येमोको चिगुरुटधरमुन येडनेड कस्तुरि निंडेनु भामिन विभुनकु व्रासिन पत्रिक कादुगदा

कलिकि चकोराक्षिकि कडकन्नुलु केंपै तोचिन चेलुवंबिप्पुडिदेमो चिंतिंपरे चेलुलु
नलुवुन प्राणेश्वरुपै नाटिन याकोनचूपुलु निलुवुन पेरुकग अंटिन नेत्तुरु कादुगदा
पडतिकि चनुगवमेरुगुलु पौपै पय्येद वेलुपल कडुमिंचिन विधमेमो कनुगोनरे चेलुलु
उडुगनि वेडुकतो प्रियुडोत्तिन नखशशिरेखलु वेडलग वेसविकालपु वेन्नेल कादुगदा
मुद्दिय चेक्कुल केलकुल मुत्यपु जल्लुल चेर्पुल वोद्दिकलागुलिवेमो ऊहिंपरे चेलुलु
गद्दरि तिरुपवेंकटपति कामिनि वदनांबुजमुन अद्दिन सुरतपु चेमटल अंदमु कादुगदा

Annamacharya's contribution to Literature is magnificent. The value and volume of his works are unparallel in the history of Telugu Literature. He has systematized the form padam. Padam, Sankirtana, Kriti and Pata are synonyms and Annamacharya's grandson declares that Annamacharya Kriti is full of Vedic thoughts, Puranic stories and secrets of

Alamelmanga Srinivasa Divya Dampatyam.
श्रुतुलै शास्त्रमुलै पुराण कथलै सुज्ञान सारंबुलै यतिलोकागम बीथुलै विविध मन्त्रार्थबुलै नुतुलै, कृतुलै वेंकट शैलवल्लभ रतिक्रीडा रहस्यंबुलै नुतुलै तालुलपाक अन्नय वचो नूत्नक्रियल् चेन्नगुन्

He has liberally made use of colloquial Telugu, native idiom and vocabulary. We can find a kind of diglossia in his works wherein we can feel simulaneously the textual and colloquial usage. His mental perception and wonderful imagery has influenced the later Telugu poets and Bhattumurty of Vasucharitra fame (16th century poet and who is considered as Sangitarahasya Kalanidhi) adopted the blue-print of Annamacharya's Sringara Manjari for building up his famous Kavya Vasucharitra. He created a Triveni Sangamam with PRAKRIYA-BHAVA--BHASHA, which is inimitable and he made every one of us to have a holy dip in that Sangamam chanting Venkateswara Ashtakshari 'Oum Namo Venkatesaya'. Chinnanna, while writing Annamacharya's biography, declares that the songs of Annamacharya are PARAMA MANTRAMS. Purandaradasa meat Annamacharya at Tirumala and says that "Annamacharya is the incarnation of Lord Venkateswara and his songs are MANTRAS. When we utter and chant them all the evil spirits will vanish". Perhaps that is the reason why the saint-poet Annamacharya did not use his name as callaphone. Tiru Venkata, Venkata Venkataraya etc, Mudras are found in his compositions. The poet also sings thus, "ANNI MANTRAMULU INDE AVAHINCHENU VENNATO NAKU KALIGE VENKATESU MANTRAMU". It is not the music, it is not the literature but it is Bhakti that is the soul and essence of his song.

This VENKATESWARA BHAVA KUSUMAM offered by Annamachaya, I am able to present only because of our great friend, Sri T.T. Vasu who is committed to propagate Annamacharya's compositions and help T.T.D. in this noble task. I am beholden to our Executive Officer, T.T.D. Sri N. Ramesh Kumar, I.A.S., and to the authorities of Madras Music Academy but for whose benigne love I would not have attempted this. My pranams to all RASIKAS that have graced this occassion and gave me a patient hearing.

Dachuko ni padalaku taga ne chesina puja livi
puchi ni kirti rupu pishpamu livi yayya

*"O LORD TREASURE THESE FLOWERS*
*OFFERED UNTO THY FEET"*



A reporduction of my Lecture in Madras Music Academy and it was awarded (SURYAKANTAMMA'S) as the Best Lecture of the series,



Gayana Patu (Asthana Vidushi Ahobila Mutt)

## Smt. Radha Padmanabhan

### [ *CLASSICAL CARNATIC VOCALIST*]

Smt.Radha Padmanabhan ( B.1947) hails from Tanjore District in Tamilnadu from a family of Scholars which is dedicated to serve and propagate Visishtadvaitha Dharma. Her parents ' Ranganayaki and M.S.Krishnan' provided devotional music atmosphere to her which was further strengthened and supported by her husband, Sri. C.V.Padmanabhan, who also has vast knowledge in Music. Her taste and aptitude for Carnatic Music was sharpened and well guided by her Gurus Sarva Sri.B.V.Raman and B.V.Laxmanan who belong to the 5th Generation disciples of Saint Thyagaraja.

**Sri Vedantha Desika's 'Sree paduka Sahasram'**, is acclaimed as the quintessence of Upanishads, Brahmasutras and Bhagavatgita. Tirumala Tirupati Devashanam's **Sree Venkateswara Recording Project** produced the 10 cassette Album.

**"Kanakadurga Suprabhatham "** composed and rendered by Smt. Radha Padmanabhan was released by HH.Sri Jayendra Saraswathi of the Kanchi Kama Koti Mutt.

**"Sri Lakshmi Narasimha Gana Mala "** was released by the Jeer of Ahobilamutt H.H.Sriman Sathagopa Sri Narayana Yateendre Mahadesikan.

**"Sri Venkatesa Krithi Sourabham "** a rare cassette of Balaji Kritis composed by the Trinity and others, sung by Smt.Radha Padmanabhan was released by T.T.D. on Ugadi, the 18th March 1999.

**"Daya Sathakam "** 108 slokas in praise of ' Daya' of Lord Venkateswara composed by Vedanta Desikan was released on 30th june 1999 by T.T.D.



## Sri Pudukkottai R. Ramanathan

Son of Late Sri K. Ramaswamy Iyer was born in 23-5-1938. He had his Bachelor of Music from Annamalai University.

He is the desciple of Sangita kalanidhi Kumbhakonam Rajamanikyam Pillai. He has 50 years of experience as Violine Artiste and accompanied many top -ranking Artistes. He was awarded gold medal by the Music Academy, Chennai 1961-62. Sri Chkra Mahapeetham, Vellore has awarded a title **"ISAIGNANA SIROMANI"**

He started his career as Lecturer in Music S.V.University, Artiste, Annamacharya Project and retired as Lecturer and head of the Dept. of Violin, S.V.College of Music and Dance, T.T.D. (1981-86). His Violin Solo Audio Cassette of Annamacharya Sankirtanas produced by T.T.D. is much appreciated. He has composed music for more than 75 devotional audio cassettes in various languages. He has become the Composer Member of THE INDIAN PERFORMING RIGHT SOCIETY LTD., 1998. His Service as the artiste of Annamacharya Project in presenting 5000 Sankirtana programmes throughout the country is worth mentioning. He was backbone for the success of propagation activities of Annamacharya Project from 1978 to 1981.



## Srimati Alekhya

Srimati Alekhya is a graduate in English Literature, Psychology and Philosophy and also holds a bachelor's Degree in Dance ( Bharatanatyam) Osmania University. She holds a Post Graduate Degree in Ancient Indian Histroy, Culture and Archeology. She is at present doing her Ph.D. in the " Padams of Kshetrayya and his contribution to Telugu Culture "

Having acquired a firm grasp on the Art from both as a performer and a Research Scholar she has emerged as a mature teacher. She is at present working as Head of the Department of Dance, Telugu University ,Hyderabad. She assists her Guru Smt.Uma Ramarao in choreography and training of talented youngsters at LASYSPRIYA a Non-Profit institute founded by her Guru.

With the combination of all the above qualities of Art and vast experience with her she brings out in her performance , the true portrayal of Indian Culture. Her scholarly demonstration of various subjects like the compositions of Annamacharys, Kshetrayya, Jayadeva, Sarangapani and the technique of Kuchipudi have won wide appreciation from great kuchipudi masters and scholars. She has many Honours and Awards by several cultural and Literary Organizations for her DEDICATION AND CONTRIBUTION TO THE FIELD OF DANCE. In the two decades of her performing career she has risen from performance to performance and is a welknown name with the connoisseurs of the Art Forum.



## Kumari B. V. Subbalakshmi

Kumari B.V.Subbalakshmi, M.A,. Music daughter of Smt. Bandi Syamala, a noted Veena Artiste. Apart from performing Classical and devotional programmes , she is training young boys and girls in karnatic music and especially Annamacharya Compositions. She is doing excellent service for the propagation of our traditional and devotional music through 'Nādabharati' a voluntary organization in twin cities. She is with 'Annamacharya Balanandam' in the Picture.



అన్నమయ్య సారస్వత సేవను పసిగట్టి ''అన్నమాచార్య సంకీర్తన కళారాధనను'' నాతో నిర్వహింపచేసి తిరుమల తిరుపతి దేవస్థానాలలో 'అన్నమాచార్య ప్రాజెక్టు'కు పూర్వరంగాన్ని సిద్ధం చేసిన మహామనీషి శ్రీ పి. యస్. రాజగోపాల రాజు ఐ.ఎ.ఎస్. గారు (తి.తి. దేవస్థానాల శ్రీకార్యనిర్వహణాధికారి 1974) ఎడమనుండి కుడికి - కీ.శే.గౌరిపెద్ది రామసుబ్బ శర్మ, కీ.శే.సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి, కీ.శే.చెలికాని అన్నారావు (తి.తి. దేవస్థానాల ఛైర్మన్), కీ.శే. ఆరుద్ర గారు, కామిశెట్టి శ్రీనివాసులు, డి. పశుపతి గారు.



అన్నమాచార్య తొలి జయంతి మహోత్సవ ప్రారంభోపన్యాసంలో (1978) అన్నమయ్య పాటల పొగరువెన్నెలలు కురిపించిన- ఆంధ్రసారస్వత సుమేరువు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ఆచార్యులు, కవీశ్వరులు, బహుభాషాకోవిదులు, పండితులు, వ్యాఖ్యాతలు, గాయకులు డాక్టర్. సి. నారాయణరెడ్డి గారు, చిత్రంలో సి. అన్నారావుగారు, పశుపతి, కామిశెట్టి శ్రీనివాసులు తదితరులు.



అప్పటికీ ఇప్పటికీ నన్నూ నా అన్నమాచార్య మహోద్యమాన్ని నిండు మనస్సుతో అర్థవంతంగా ముందుకు నడుపుతున్న - పత్రికారంగ మహాయోగి, సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు (ఆంధ్రప్రభ తదితరాలు) ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీఅధినేత, భ్రాతృసమానులు, 'నెయ్యపు సొగసుల పొత్తం' పొత్తూరి వేంకటేశ్వరరావుగారు. వారి ప్రణయపరిష్వంగంలో 'సుకన్యా ఆర్ట్సు థియేటర్ వారి' సాక్షిగా....



''తి.తి.దేవస్థానాలలో అన్నమాచార్య ప్రచారకార్యక్రమాలు ఇన్నీ ఎట్లా నిర్వహిస్తున్నావు'' అంటూ....... ఈ కార్యకలాపాలన్నీ ఒక వేదిక మీదికి తెచ్చి 'అన్నమాచార్యప్రాజెక్టు' తాంబూలాన్ని తొలుత నా చేత పెట్టి ప్రారంభింపచేసిన మహోదయులు శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ ఐ.ఎ.ఎస్. గారు, పరిష్కరణ, ప్రచురణ,పరిశోధన ఒక విభాగంగ సోదాహరణ సంకీర్తన ప్రచారం రెండవ విభాగంగ, రికార్డింగు వ్యవహారాలు మూడవ విభాగంగ 'అన్నమాచార్య ప్రాజెక్టు' సారథ్యం వహించి నన్ను ముందుకు నడిపిన అమృతమూర్తి అప్పటి శ్రీకార్యనిర్వహణాధికారి(1978).



1979 - 80 లో అన్నమాచార్య సంకీర్తనను భాగ్యనగరానికి పరిచయం చేసి ప్రామాణికమైన అన్నమయ్య సాహిత్య సదస్సును నిర్వహించిన నవ్య నాటక సమితి సంస్థాపకులు. అన్నమయ్య విగ్రహాన్ని తరుపతి దేవస్థానం వారితో కడప నగరం నడిబొడ్డులో ప్రతిష్ఠింపచేసిన భక్తవరేణ్యుడు ఆత్మీయ మిత్రులు వేమరాజు నరసింహరావు గారు.

★ ★ ★



'' ఫాలనేత్రానల ప్రబలి విద్యుల్లతా
కేళీవిహార లక్ష్మీ నారసింహా ''

*Annamacharya Mission is a Charitable Trust established on 25th September 1999 under Registration No. 139/99.*

## AIMS & OBJECTIVES :

- To Preserve and propagate Annamacharya and other Devotional literature, Culture and Heritage,
- To Establish research centres, release publications and to propagate through mass media.
- To Establish Music and Dance Schools and to impart education and art skills in the younger generation.
- To Conduct Programmes throughout the world to strengthen the activities of Mission.
- To Undertake the activities of production of Cassets, C.Ds, C.D. Roms, Short Films, Documentaries, Episodes etc., for propagation of Mission.
- To Develop and release Cultural Magazines in different languages.
- To work for the welfare of the people at large and aim for National Integration.
- To Do any other act for the advancement of general public utility without distinction of caste, colour, creed or nationality.

The donations made to Annamacharya Mission shall be exempt from Income Tax under Sec. 80-G of the Income Tax act 1961.


**ANNAMACHARYA MISSION**

2-2-647/103/102, Sai Residency

Central Excise Colony, Hyderabad- 500 013.

& : 7603158, 7645533, 7661549